నేడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు

- విద్యా సంస్థల్లో కూడా...
- ఇప్పటికే రెండో స్థానంలో విశాఖ
- 14 అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఎంపిక
- మొదటి స్థానం కోసం కసరత్తు



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా గత నెల శివాజీ పార్కులో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్. చిత్రంలో మేయర్ హరివెంకటకుమారి, నాటి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఉన్నారు. (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడమే దీని లక్ష్యం. ఇందులో ప్రతి పౌరుడు భాగస్వామి అయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులదే. అది మాత్రమే కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయం అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దాల్సి ఉంది. ఫైళ్లను, ఫర్నీచర్‌ను క్రమ పద్ధతిలో ఉంచుకోవడం, ప్రజల రాకపోకలు సాగించే ప్రాంతాల్లో అడ్డంకులు లేకుండా చేయడం వంటివి అందులో భాగం. నెలకో అంశాన్ని థీమ్‌గా తీసుకొని ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గత

... మిగతా 6వ పేజీలో

రెండో స్థానంలో విశాఖ జిల్లా

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలు విషయంలో పట్టణాభివృద్ధి శాఖ నిర్దేశించిన ప్రమాణాలు పాటించిన వారికి ప్రభుత్వం ర్యాంకులు ప్రకటిస్తూ వస్తోంది. ఇందులో ఎన్‌టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలవగా, విశాఖ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకులకు 14 అంశాలను పరిశీలిస్తున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, ప్రజా మరుగుదొడ్లు, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించడం, ఘన వ్యర్థాల నిర్వహణ వంటివి అందులో ఉన్నాయి. మొత్తం 200 పాయింట్లకుగాను ఎన్‌టీఆర్ జిల్లా 127 పాయింట్లతో మొదటి స్థానంలో, 122 పాయింట్లతో విశాఖ రెండో స్థానంలో నిలిచాయి. ఈసారి విశాఖ జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ఇక్కడి అధికారులు యత్నిస్తున్నారు.

పట్టాలెక్కనున్న మెట్రో రైలు ప్రాజెక్టు

తొలి దశ పనులకు 99.75 ఎకరాలు సేకరణ



- ప్రభుత్వ భూమి 90.75 ఎకరాలు, ప్రైవేటు భూమి తొమ్మిది ఎకరాలు
- భూసేకరణపై ప్రాథమికంగా సర్వే
- మొత్తం మూడు కారిడార్లు
- స్టీల్‌ప్లాంట్-కొమ్మాది, గురుద్వారా-పాత పోస్టాఫీస్, తాటిచెట్లపాలెం-చినవాల్తేరు
- 46.75 కిలోమీటర్లు, 42 స్టేషన్లు...

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు పట్టాలెక్కనున్నది. ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రాథమికంగా 99.75 ఎకరాలు అవసరమని అధికారులుఅంచనాకు వచ్చారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన భూమి 90.75 ఎకరాలు ఉండగా, మరో తొమ్మిది ఎకరాలు ప్రైవేటు వ్యక్తులది.

మెట్రో రైలు ప్రాజెక్టుకు గత ఏడాది డిసెంబరులోనే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు భూసేకరణకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రాజెక్టు కోసం తొలి దశలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 47.75 ఎకరాలు, పోర్టుకు చెందిన 36 ఎకరాలు, రైల్వే భూమి నాలుగు ఎకరాలు, కేంద్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి మూడు ఎకరాలు, ప్రైవేటు భూమి తొమ్మిది ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని గుర్తించారు. సర్వే బాధ్యతను జాతీయ రహదారుల భూసేకరణ విభాగానికి అప్పగించారు. కాగా మెట్రో మొదటి దశ ప్రాజెక్టు 46.75 కి.మీ. పొడవునా నిర్మించనున్నారు. తొలి దశలో స్టీల్‌ప్లాంట్-కొమ్మాది, గురుద్వారా-పాత పోస్టాఫీస్, తాటిచెట్లపాలెం-చినవాల్తేరు మార్గాల్లో కారిడార్లు నిర్మిస్తారు. స్టీల్‌ప్లాంట్-కొమ్మాది మధ్యన 29 స్టేషన్లు, గురుద్వారా- పాత పోస్టాఫీసు మధ్య ఆరు స్టేషన్లు, తాటిచెట్లపాలెం-చినవాల్తేరు మధ్యన ఏడు...మొత్తం 42 స్టేషన్లు ఏర్పాటుచేస్తారు.

పర్యాటకాభివృద్ధి ప్రకటనలకే పరిమితమా!

ఆర్డీ పోస్టు నాలుగు నెలలుగా ఖాళీ

రుషికొండ భవనాన్ని నిర్మించిన అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు

- ఆయన్ను తప్పించండి మొర్రో అంటూ కూటమి నేతలు మొత్తుకుంటున్నా పట్టించుకోని పెద్దలు
- ఇప్పుడు వైసీపీ నాయకుడి బంధువును రీజనల్ డైరెక్టర్‌గా తీసుకొచ్చేందుకు యత్నం
- ప్రస్తుతం పర్యాటకులు బస చేసేందుకు ఏపీటీడీసీ పరిధిలో ఒక్క గదీ లేదు
- ఆధునికీకరణ పేరుతో అప్పుఘర్ వద్ద ఉన్న యాత్రీనివాస్ మూత



అప్పుఘర్ వద్ద ఆధునికీకరణ పనులు ఆగిపోయిన యాత్రీనివాస్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తామని, కొత్త కొత్త ప్రాజెక్టులు తీసుకువస్తామని కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన కుదరడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎవరైతే చక్రం తిప్పారో అదే అధికారికే మరిన్ని అదనపు బాధ్యతలు అప్పగించి కీలక పోస్టులో కూర్చోబెట్టారు. ఆయన రుషికొండపై ఉండే రిసార్ట్స్‌లో ఫర్నీచర్‌ను తుక్కు పేరుతో అమ్మేసి, భారీగా దిగమింగారని ఆధారాలతో సహా చూపించినా చర్యలు తీసుకోలేదని కూటమి నేతలు బహిరంగంగానే వాపోతున్నారు.

రుషికొండపై రూ.500 కోట్లతో జగన్మోహన్ రెడ్డి నిర్మించుకున్న రాజ భవనాన్ని ఇంజనీరింగ్ అధికారి (ఈఈ) హోదాలో పర్యవేక్షించి, వాటి వివరాలు బయటకు పొక్కకుండా, అప్పుడు ప్రతిపక్ష పార్టీ నేతలైన తెలుగుదేశం, జనసేన నాయకుల్ని రుషికొండ రాకుండా అడ్డం పడింది కూడా ఆయనే అని చెబుతున్నా పర్యాటక శాఖ పెద్దల తలకు ఎక్కడం లేదు.

విశాఖలో ఏపీటీడీసీకి ఒక్క గది లేదు

విశాఖపట్నానికి పర్యాటకులు వస్తే బస చేసేందుకు ఏపీటీడీసీ తరపున ఒక్క గది కూడా అందుబాటులో లేకుండా పోవడానికి కారణం కూడా ఆ పెద్ద మనిషే కావడం గమనార్హం. అప్పుఘర్ సమీపాన యాత్రీ నివాస్ ఉండగా దానిని ఆధునికీకరిస్తామని మూడేళ్ల క్రితం రూ.8.5 కోట్లతో ఆ అధికారి ఆధ్వర్యంలోనే పనులు చేపట్టారు. భవనానికి ప్లాస్టరింగ్ చేసి, రంగులేసి, ఫర్నీచర్ మార్చడానికి ఈ నిధులు ఉపయోగించుకుంటామని అప్పట్లో చెప్పారు. కొంతకాలం గడిచాక ఆ నిధులు సరిపోకపోవడం లేదని మధ్యలో పనులు ఆపేశారు. పూర్తి చేయాలంటే అదనంగా మరో రూ.3.5 కోట్లు అవసరం అని లెక్క తేల్చారు. వాస్తవానికి రూ.12 కోట్లు పెడితే ఆ స్థలంలో కొత్త భవనాన్నే నిర్మించవచ్చుననేది కూటమి నేతల వాదన. ఆ అధికారి హయాంలో అన్నీ తప్పులే కనిపిస్తున్నా కనీస చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన్ను బదిలీ చేస్తారని అంతా అనుకున్నారు. కానీ మరిన్ని అదనపు బాధ్యతలు అప్పగించారు. పర్యాటక శాఖలో రీజనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అధికారి ఆ శాఖలో అంతర్గత రాజకీయాలు, ఫిర్యాదులు తట్టుకోలేక నాలుగు నెలల క్రితం మాతృశాఖకు వెళ్లిపోయారు. దాంతో ఆబాధ్యతలు కూడా ఈ ఇంజనీరింగ్ అధికారికే అప్పగించారు. దాంతో కూటమి నేతలకు తల కొట్టేసినంత పని అయింది. 'ఆయన మాకు వద్దు' అని స్పష్టంగా చెప్పి, ప్రత్యామ్నాయంగా కొందరు అధికారుల పేర్లు సూచిస్తే అది కూడా పరిశీలించలేదు. పక్కన పెట్టేశారు. తమకు కొన్ని ఆలోచనలు ఉన్నాయని చెప్పినట్టు సమాచారం. అయితే చోడవరానికి చెందిన వైసీపీ నాయకుడి దూరపు బంధువు అయిన ఒక అధికారిని

... మిగతా 6వ పేజీలో

జీబీఎస్ కలకలం

నగరంలో నాలుగు రోజుల వ్యవధిలో ఐదు కేసులు నమోదు



- కేజీహెచ్‌లోని ఎక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో చికిత్స...నిలకడగా ఆరోగ్యం
- ఈ కేసులు కొత్త కాదంటున్న వైద్యులు
- ఆందోళన చెందొద్దని సూచన...
- ప్రతినెలా కేజీహెచ్‌కు ఐదు నుంచి పది కేసులు వస్తుంటాయని వెల్లడి
- అలాగని నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరిక

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):

దేశంలోని అనేక రాష్ట్రాల్లో వెలుగుచూస్తున్న గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు విశాఖలో నమోదుకావడం కలకలం రేపింది. గడిచిన నాలుగు రోజుల వ్యవధిలో ఐదుగురు ఈ సమస్యతో కేజీహెచ్‌లో చేరారు. ప్రస్తుతం జనరల్ మెడిసిన్ విభాగంలోని అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. అయితే, పూర్తిగా కోలుకునేంత వరకు తమ పర్యవేక్షణలో సేవలు కొనసాగుతాయని వెల్లడించారు.

జీబీఎస్ కేసులు నమోదైనట్టు తెలియడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. అయితే, కంగారు పడాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇది ఇప్పటికిప్పుడు పుట్టుకు వచ్చినది కాదని, ఎప్పటి నుంచో ఈ తరహా సమస్యలతో రోగులు వస్తున్నారని అంటున్నారు. కేజీహెచ్‌కు ప్రతినెలా ఈ తరహా కేసులు పది వరకూ వస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. అలాగని నిర్లక్ష్యం వహించవద్దని కూడా హెచ్చరిస్తున్నారు. కొన్ని రకాల లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఈ కేసులు నమోదు కావడానికి గల కారణాలు తెలియాల్సి ఉందంటున్నారు. ఇది కొవిడ్ వైరస్ తరహాలో ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందేది మాత్రం కాదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

వైరల్ ఫీవర్స్, డయేరియా తగ్గిన తరువాత, బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ వల్ల జీబీఎస్ బారినపడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్ ప్రభావంతో మెదడు నరాలపై ఉండే అత్యంత కీలకమైన మ్యాలిన్ పొర దెబ్బతింటుంది. సొంత వ్యాధి నిరోధక వ్యవస్థలోని యాంటీ బాడీస్ మ్యాలీన్ పొరను దెబ్బతీసినప్పుడు మెదడు నుంచి వచ్చే సిగ్నల్స్ అందక అవయవాలు చచ్చుబడిపోతాయి. అటువంటి సమయంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. మెదడు నుంచి కాళ్ల వరకు పొడవుగా ఉండే నరాలు ప్రభావితమైతే కాళ్లు చచ్చుబడిపోతాయి. అచేతనం కావడం కింది నుంచి పైకి పాకుతుంది. దీంతో వీపు భాగం, చేతులు, మెడ కండరాలు దేహమంతా పూర్తి అచేతనంగా మారుతుంది. మింగడం కూడా కష్టమవుతుంది. కళ్లు మూయలేని స్థితికి చేరుకుంటాడు.

వారం నుంచి రెండు వారాల్లో తగ్గుముఖం

సాధారణంగా ఈ వైరస్

... మిగతా 6వ పేజీలో

నాలా పన్ను ఎగవేత

భూ వినియోగ మార్పిడికి అనుమతి పొందకుండానే నిర్మాణాలు



- చోద్యం చూస్తున్న రెవెన్యూ
- భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేసిన జీవీఎంసీ
- నిర్మాణదారులతో టౌన్‌ప్లానింగ్ అధికారుల కుమ్మక్కు
- రూ.120 కోట్ల మేర ఆదాయం కోల్పోయిన నగర పాలక సంస్థ
- విజిలెన్స్ దృష్టి
- విచారణ జరుగుతున్నట్టు సమాచారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ ఎసెస్‌మెంట్ యాక్ట్) పన్ను కట్టకపోయినా భవన నిర్మాణాలకు గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చేస్తున్నారు. భవన నిర్మాణదారులతో ముందుగానే అవగాహన కుదుర్చుకుని నాలాతో నిమిత్తం లేకుండానే ప్లాన్‌లు జారీ చేసేస్తున్నారు. నిర్మాణం పూర్తికాగానే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) మంజూరు చేస్తున్నారు. దీనివల్ల రెవెన్యూ శాఖతోపాటు జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఈ విధంగా జీవీఎంసీ పరిధిలోనే రూ.120 కోట్ల వరకూ కుంభకోణం జరిగినట్టు ప్రచారం జరుగుతుండడంతో విజిలెన్స్ విభాగం విచారణ జరుపుతున్నట్టు సమాచారం.

గాజువాక, మధురవాడ, భీమిలి పరిసర ప్రాంతాలన్నీ కొన్నాళ్ల కిందట జీవీఎంసీలో విలీనమయ్యాయి. నగర విస్తరణ నేపథ్యంలో శివారున ఉన్న ఆయా ప్రాంతాల్లో భవన నిర్మాణాలు పెరుగుతున్నాయి. అయితే అవన్నీ వ్యవసాయ భూములు కావడంతో భవన నిర్మాణాలు చేపట్టాలన్నా, పరిశ్రమలు ఏర్పాటుచేయాలనుకున్నాసరే భూ వినియోగ స్వభావాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. అందుకోసం యజమానులు ఆ భూమి విలువలో ఐదు శాతం మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించి, ఆ రశీదుతోపాటు భూమి స్వభావాన్ని మార్చాలని కోరుతూ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కి దరఖాస్తు చేసుకుంటే, ఆయన పరిశీలించి సంబంధిత తహసీల్దార్‌కు పంపి...క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణంతోపాటు అక్కడ భూమి విలువ ఎంత ఉంది?, నాలా కింద చెల్లించిన మొత్తం సరిపోతుందా?, ఇంకా అదనంగా చెల్లించాల్సి ఉందా?...వంటివి పరిశీలించిన తర్వాత భూమి వినియోగ స్వభావాన్ని రికార్డుల్లో మార్పు చేసి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఆ తర్వాతే

... మిగతా 6వ పేజీలో

విశాఖలో బ్రౌన్ షుగర్

- 2 గ్రాములతో పట్టుబడిన ముగ్గురు ఒడిశా వాసులు ... మెయిన్‌లో

ఒక్క అడుగు ఆక్రమణకు గురైనా అధికారులదే బాధ్యత

- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడండి
- కలెక్టర్ ఆదేశం - 7వ పేజీలో

దామోదరం సంజీవయ్యకు నివాళి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొని, సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. - 6వ పేజీలో

వివాహిత ఆత్మహత్య

- భర్త వికృత చేష్టలు, వేధింపులే కారణం
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):

భర్త వికృత చేష్టలు, లైంగిక వేధింపులను తట్టుకోలేని వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నగరంలోని గోపాలపట్నం ప్రాంతంలో గల నందమూరి నగర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గాజువాక ప్రాంతానికి చెందిన వసంత (24)కు, 92వ వార్డు నందమూరి నగర్‌కు చెందిన చిక్కాల నాగేంద్రబాబుకు ఏడాది క్రితం వివాహం జరిగింది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే నాగేంద్రబాబు పెళ్లైనప్పటి నుంచి భార్యను వేధించేవాడు. ఆమెకు అసభ్యకర వీడియోలు చూపిస్తూ, వికృత చేష్టలకు పాల్పడేవాడు. అంతేకాకుండా లైంగిక వాంఛను ప్రేరేపించే మాత్రలు తీసుకువచ్చి, వాటిని వేసుకోవాలని తీవ్రంగా ఒత్తిడి చేసేవాడు. దీంతో దంపతుల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. అనంతరం రాత్రి పది గంటల సమయంలో నాగేంద్రబాబు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. భర్త చేష్టలకు విసిగిపోయి, తీవ్ర మనస్తాపానికి గురైన వసంత తన గదిలోకి వెళ్లి సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. దంపతుల మధ్య పెద్ద గొడవ జరగడాన్ని గమనించిన సమీప ప్రాంతాల వాసులు నాగేంద్రబాబు బయటకు వెళ్లిపోయిన తరువాత అతడి ఇంట్లోకి వెళ్లారు. గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు వసంత ఉరివేసుకుని వేలాడుతుండడాన్ని గమనించి, వెంటనే ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే వసంత మృతి చెందినట్టు వైద్యులు

... మిగతా 6వ పేజీలో

నయనమనోహరం సిరి సింహాద్రినాథుల నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సిరి సింహాద్రినాథుల నిత్యకల్యాణం నయన మనోహరంగా సాగింది. శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా నిర్వహించారు. ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. సంప్రదాయబద్ధంగా వేడుక నిర్వహించారు.

మోడల్ స్కూలులో ప్రాథమిక తరగతుల విలీనం తగదు

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అప్పారావు

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జీవో 117 సవరణ ఉత్తర్వుల పేరుతో గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుండడం శోచనీయమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ అప్పారావు మండిపడ్డారు. శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయటం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ, అందుకోసం ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు చదువుతున్న ప్రాథమిక పాఠశాలలోని 3,4, 5 తరగతులను మోడల్ పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. సమావేశంలో పద్మనాభం, ఆనందపురం, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి రఘువర్మ విజయం కోరుతూ ప్రచారం

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయాన్ని కోరుతూ శుక్రవారం అనంతవరం, కొవ్వాడ, గంధవరం, బాందేవుపురం గ్రామాల్లో టీడీపీ శ్రేనులు ప్రచారం నిర్వహించారు. భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొరైపాటి పెద ఎర్రినాయుడు, సర్పంచ్ గొరైపాటి వెంకటలక్ష్మి, టీడీపీ నేతలు సిద్దనాతి వెంకటరావు, రమణమ్మ, అప్పల సూర్యనారాయణ, తాతాజీ, కోన శ్రీను. అయా గ్రామాలోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి రఘువర్మకు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమి స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

ఆనందపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గంభీరం పంచాయితీ పరిధి ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ వైకుంఠం ఆధ్వర్యంలో రాధా కృష్ణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. శుక్రవారం వాస్తు యజ్ఞంతో కార్యక్రమం ప్రారంభం కాగా, బెంగళూరు నుంచి వచ్చిన హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రధాన పూజారి శ్రీగుణభద్ర దాస, కులశేఖర దాస, శ్రీనివాస దాస, నిష్కించిన భక్త దాసలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాస్తు యజ్ఞం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలకు భక్తులకు వివరించారు. ఈ హోమం చేస్తే ఇంట్లో ఐశ్వర్యం, ఆరోగ్యం, శాంతి చేకూరడంతో పాటు దోష నివారణ కలుగుతుందని పేర్కొన్నారు. అన్నసమారాధన చేశారు.

పేపర్ మోడలింగ్‌పై గీతంలో వర్క్‌షాప్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడం, ఆర్కిటెక్చర్ పట్ల అవగాహన పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పేపర్ మోడలింగ్‌పై శుక్రవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రముఖ ప్యాకేజింగ్ డిజైన్ నిపుణుడు అరుణ్‌దేశాయ్ ముఖ్యఅతిథిగా హాజరై పేపర్ మోడలింగ్‌లను తయారుచేయించారు.పేపర్‌తో వివిధ రకాల ఆకృతులు, నిర్మాణాలను రూపొందించడం ద్వారా ఆర్కిటెక్చర్‌పై అవగాహన పొందారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సత్యదేవ్ మాట్లాడారు.

సంజీవయ్య సేవలు అమూల్యం: కలెక్టర్

మహారాణిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్య మంత్రి దామోదరం సంజీవయ్య సేవలు అమూల్యమని, ఆయన జీవితం స్ఫూర్తి దాయకమని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శ్లాఘించారు. శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో వేడుక నిర్వహించారు. ముందుగా సంజీవయ్య చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. సంజీవయ్య సమాజానికి చేసిన సేవలను గుర్తుచేస్తూ, మంచి పాలనా దక్షత ఉన్న నేతగా కొనియాడారు. విశాఖలో నేషనల్ లా కళాశాలకు సంజీవయ్య పేరు పెట్టుకు న్న విషయాన్ని గుర్తు చేశారు.

ఈ సమావేశంలో కార్మిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రామారావు, బి.సి. సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, పీడీ లక్ష్మీపతి, ఏవో ఈశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుతో పార్కింగ్ ఇబ్బందులు

- బీచ్‌రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా బడ్డీల ఏర్పాటు
- రాత్రికి రాత్రే ఆక్రమణ
- సందర్శకులు, పర్యాటకుల వాహనాలు నిలిపేందుకు స్థలం దొరకని పరిస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పొట్టి శ్రీరాములు పార్కు ముందు దుకాణాల వరుస



బడ్డీల మధ్యలో కారు పార్కింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి

భీమునిపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రంగా పేరొందిన భీమిలి బీచ్‌రోడ్డులో అడ్డూఅదుపు లేకుండా వెలుస్తున్న దుకాణాలతో రహదారి కిక్కిరిసిపోతోంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. భీమిలి అందాలను ఆస్వాదిద్దామని సుదూర ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న సందర్శకులు, పర్యాటకులు కనీసం వారి వాహనాల పార్కింగ్‌కు స్థలాలు కూడా లేకపోవడంతో ఇక్కట్లకు గురవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బీచ్‌రోడ్డులో దుకాణాలు వరుసగా వెలుస్తుండడంతో రహదారులు ఇరుగ్గా మారిపోయాయి. సందర్శకులకు ఆహ్లాదాన్ని కలుగజేయాలన్న ఉద్దేశంతో మునిసిపాలిటీ ఏర్పాటు చేసిన పావురాల పార్కు, పొట్టి శ్రీరాములు పార్కు, అల్లూరి సీతారామరాజు పార్కులు సందర్శకులకు కనిపించకుండా పోతున్నాయి. అసలు పొట్టి శ్రీరాములు పార్కు అక్కడ ఉన్నదన్న విషయమే పర్యాటకులు గుర్తుపట్టలేనంతగా ఆ పార్కు ముందు దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలశాయి. పావురాల పార్కు పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. అక్కడ కూడా బడ్డీలు ఒకదాని పక్కన మరొకటి చైన్ లింక్ దుకాణాలుగా తయారయ్యాయి.

బడ్డీల దందా..

సందర్శకులతో నిత్యం కిటకిటలాడే బీచ్‌రోడ్డులో జోరుగా వ్యాపారాలు సాగుతుంటాయి. అందుకే ఈ రోడ్డులో బడ్డీల ఏర్పాటుకు గిరాకీ ఏర్పడింది. తమ పలుకుబడిని ఉపయోగించి కొందరు రెండు, మూడు బడ్డీలను కూడా ఏర్పాటు చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇవ్వడం ద్వారా వారు సొమ్ము చేసుకుంటున్నారు. రహదారికి, ఫుట్‌పాత్‌కు మధ్య కూడా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాల పార్కింగ్‌కు సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. పైలాన్ దగ్గరలో కార్లు, బైకులు పార్కింగ్ చేస్తుండగా, అక్కడ కూడా ఇటీవల రెండు రెడీమేడ్ దుకాణాలు వెలశాయి. అలాగే మరుగుదొడ్ల వద్ద మరో రెడీమేడ్ దుకాణం ఏర్పాటైంది.

ఇంత జరుగుతున్నా అధికారులు ఏమాత్రం అటుగా చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పైగా సాయంత్రం వేళల్లో బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం జరుగుతున్నా కనీసం పోలీసులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలకు వేర్వేరుగా పార్కింగ్‌లు కేటాయిస్తూ మార్కింగ్‌లు చేయాలని పలువురు కోరుతున్నారు.

నర్సీపట్నంలో ముగ్గురి అదృశ్యం

- అంతా ఒకే కుటుంబ సభ్యులు
- 8వ తేదీ నుంచి కానరాని ఆచూకీ
- పట్టణ పోలీసుల ముమ్మర దర్యాప్తు



రాజేశ్



రాజేశ్ తల్లి రాణి



పి.చక్రమ్మ

నర్సీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నర్సీపట్నం కాపు వీధిలో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అదృశ్యమయ్యారు. ఇందుకు సంబంధించి పట్టణ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం నీలంపేటకు చెందిన బట్ట రాణి, తల్లి చక్రమ్మ, పెద్ద కుమారుడు రాజేశ్, చిన్న కుమారుడు మోహన్‌తో కలిసి నర్సీపట్నం కాపువీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు రాజేశ్ తోపుడు బండిపై ఫ్యాన్సీ సామగ్రి అమ్ముకునేవాడు. చిన్న కుమారుడు మోహన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా రెండు నెలలుగా టీ దుకాణం నడుపుతున్నాడు. రాజేశ్ సుమారు రూ.10 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఆ విషయం కుటుంబ సభ్యులెవరికీ తెలియదు. అయితే ఫ్యాన్సీ సామగ్రి అమ్మకం లాభసాటిగా లేదని, టీ టైమ్ షాపులోనే తినుబండారాలు అమ్ముకుంటానని తమ్ముడు మోహన్‌తో అనడంతో ఇద్దరు కలిసి వ్యాపారం చేసుకుందామని అనుకున్నారు. మోహన్ షాపులో పెట్టుబడి పేరుతో ఈ నెల 6వ తేదీన తెలిసిన వారి దగ్గర రాజేశ్ మరో రూ.50 వేలు అప్పు చేశాడు. ఈ విషయం తెలిసి...ఆ డబ్బులు ఏమయ్యాయని మోహన్ ఈ నెల ఏడో తేదీన అన్నను నిలదీశాడు. పాత అప్పులకు వడ్డీల కింద కట్టేశానని రాజేశ్ చెప్పాడు. అన్నదమ్ముల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం మోహన్ నీలంపేటలోని సొంతింటికి వెళ్లిపోయాడు. ఉదయం సెల్ ఫోన్ చూసే సరికి ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్టు రాజేశ్ పెట్టిన మెసేజ్‌లు చూసి ఆందోళన చెందాడు. ఈ నెల 8న ఉదయం కాపువీధిలోని ఇంటికి వచ్చి చూస్తే తల్లి రాణి, అమ్మమ్మ పెనుమచ్చు చక్రమ్మ, అన్నయ్య రాజేశ్ కనిపించలేదు. బంధువులకు రెండు రోజులుగా ఫోన్లు చేసి వాకబు చేశాడు. ఆచూకీ లేకపోవడంతో ఈ నెల పదో తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజేశ్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా విచారణ చేస్తున్నామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. నాతవరం మండలం ఎంబీ పట్నం ఏలేరు కాలువ వద్ద చివరిగా సిగ్నల్స్ కనిపించాయన్నారు. అన్ని వాట్సాప్ గ్రూపుల్లో ముగ్గురి ఫొటోలు పెట్టినట్టు ఆయన చెప్పారు. ఏడు రోజులుగా తల్లి, అమ్మమ్మ, అన్నయ్య ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళనగా ఉందని మోహన్ వాపోయాడు.

25న జాతీయ స్థాయి సైంటిఫిక్ కాన్ఫరెన్స్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అధ్యాపకులు

తగరపువలస, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఈ నెల 25న ఒకరోజు జాతీయ స్థాయి సైంటిఫిక్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు ఆ కళాశాల యాజమాన్యం తెలిపింది. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఏపీవోటిహెచ్‌ఈకేఈ 2కె25 బ్రోచర్‌ను అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఐపీఏ విద్యా విభాగం, ఏపీఐటీ రాష్ట్ర శాఖ సంయుక్తంగా అవంతి శ్రీగాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. 'ఇన్‌స్పైర్ అండ్ ఇన్నోవేట్ ది గ్లీమింగ్ ఫ్యూచర్ ఆఫ్ ఫార్మసీ' థీమ్‌తో ఈ సైంటిఫిక్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఫార్మసీ విద్యార్థులందరూ పాల్గొనాలని కోరారు. ఫార్మాస్యూటికల్ సైన్స్‌స్‌ను రూపొందించే పరివర్తనాత్మక పురోగతిని హైలెట్ చేస్తుందని, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ సవాళ్లను పరిష్కరించేటపుడు డ్రగ్ డెవలప్‌మెంట్, డిజిటల్ హెల్త్, పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో ఆవిష్కరణకు మార్పు కలుగుతుందన్నారు. భవిష్యత్ పురోగతులకు నడపడానికి ఈ సదస్సు ఒక వేదికగా నిలుస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంబీవీరాజు, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వి.ఉమాశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలువలో కారు బోల్తా



చిల్లపేట కాలువలో బోల్తా పడిన కారు

తగరపువలస, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చిల్లపేట కాలువలో శుక్రవారం మధ్యాహ్నం కారు బోల్తా పడింది. తగరపువలస నుంచి భీమిలివైపునకు వెళుతుండగా ఆటోను అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే యత్నంలో కారు వెళ్లి కాలువలో పడింది. కారులో ఉన్న కొమ్మాదికి చెందిన ముగ్గురు యువకులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయట పడ్డారు.

కారు కాలువలో పడగానే విండోస్ నుంచి మురుగు లోనికి వెళ్లడంతో ఆ యువకులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే, కాలువ ప్రక్కనే ఉన్న చిట్టివలస పెద్ద చెరువులో స్నానాలు చేస్తున్న యువకులు వెంటనే అక్కడకు చేరుకొని కారులో ఉన్న యువకులను బయటకు తీశారు. ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వివాహిత ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

నిర్ధారించారు. దీంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి వెంకటరమణ శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.అతడి వద్ద కామవాంఛ ను ప్రేరేపించేమాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

పర్యాటకాభివృద్ధి ప్రకటనలకే పరిమితమా!

... 5వ పేజీ తరువాయి

తీసుకువచ్చి ఆర్డీగా నియమిస్తారని తెలిసి మళ్లీ కూటమి నేతల నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్టయింది. వైసీపీకి ఊడిగం చేసిన అధికారులనే తీసుకువచ్చి కీలక స్థానాల్లో ఎలా నియమిస్తారని ప్రశ్నించినట్టు తెలిసింది.

ఇక ఇటీవల ఇక్కడ ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. ఈ అధికారుల తీరు తెలిసి ఈ ప్రాంతానికి చెందినవారు ఎవరూ విశాఖలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రాలేదని, వచ్చిన వాటిలో అధికం రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు చెందినవేనని, ఈ విషయం కూడా పర్యాటక శాఖ పెద్దలు గుర్తించడం లేదని విశాఖ కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. విశాఖ పర్యాటక శాఖలో అధికారుల మధ్య సమన్వయం లేదు. ఈ నేపథ్యంలో పర్యాటక శాఖ అధికారులు తెచ్చే ప్రతిపాదనలు పూర్తిగా పరిశీలించకుండా ఓకే అంటే...ఏమి చిక్కులు వచ్చి పడతాయోనని జిల్లా ఉన్నతాధికారులు ఒకటికి, రెండుసార్లు ఆలోచించి వెనక్కి పంపేస్తున్నారు. దాంతో ఇక్కడ ఏదీ ముందుకు కదలడంలేదు. విశాఖలో అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య భారీగా పడిపోయింది. ఆ లెక్కలు కూడా బయటకు రానీయడం లేదు.

6 నుంచి ఎల్లమ్మ జాతర మహోత్సవాలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భీమిలి రెల్లివీధిలోని ఎల్లమ్మ జాతర మహోత్సవాలు మార్చి 6 నుంచి 9 వరకూ ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నాయకులు వెరుపండా ఆనంద్, సత్యనారాయణమూర్తి తెలిపారు. మార్చి 6న రాత్రి అమ్మవారి తొలేళ్ళ ఉత్సవం, 7న అనుపు ఉత్సవం, మిగిలిన రెండు రోజులు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

రొయ్యపిల్లల ఉత్పత్తి కేంద్రాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌రోడ్ మంగమారిపేట, తిమ్మాపురం ప్రాంతంలో వున్న రొయ్యపిల్లల ఉత్పత్తి కేంద్రాలను శుక్రవారం కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ డైరెక్టర్ డా. పి.శంకరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు ఆయన వెంట వున్నారు. ఆక్వా కల్చర్, ఆక్వా సంబంధిత యూనిట్లలో నిషేధిత యాంటీబయోటిక్స్ వినియోగిస్తున్నారేమోనని పరిశీలించారు. రొయ్యపిల్లల ఉత్పత్తికి వాడుతున్న మేత, ప్రోబయోటిక్స్ తదితర ఉత్పత్తులన్నింటిని సీఏఏ ధురవీకరించినవి మాత్రమే ఉపయోగించాలని శంకరరావు సూచించారు. ఈ సందర్భంగా పలు హేచరీలలో పరీక్షల నిమిత్తం శాంపిల్స్‌ను ఎంపెడా వారు సేకరించారు. తనిఖీలలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రియ, మత్స్యశాఖాధికారి లావణ్య, అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంజీవయ్యకు ఘన నివాళి



కొమ్మాది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో ఆయన చిత్రపటానికి కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అడిషనల్ కమాండెంట్లు సి.హెచ్ పద్మనాభరాజు, పి.సత్యం, వి.నారాయణ, జి.ఇలియసాగర్, ఆర్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

... 5వ పేజీ తరువాయి

జనవరిలో 'న్యూ ఇయర్...క్లీన్ స్టార్ట్' అని అమలు చేశారు. ఇప్పుడు ఫిబ్రవరిలో 'మన మూలాలు..మన బలాలు' అనే అంశాన్ని తీసుకున్నారు. మన చరిత్ర ఏమిటి?, వనరులను ఎలా సద్వినియోగం చేసుకోవాలనేది దీని ఉద్దేశం. కాలుష్యం లేని పర్యావరణం, ఘన వ్యర్థాల సక్రమ నిర్వహణ, స్వచ్ఛమైన నీటి వనరులు, ఇళ్లు, అపార్టుమెంట్లు, కాలనీ, గ్రామాలు అన్నీ పరిశుభ్రంగా ఉండేలా అక్కడి వారిని భాగస్వాముల్ని చేయాలి. పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు, గుడులు, గోపురాలు, చర్చిలు, మసీదులు, పరిశ్రమల్లోను దీనిని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గాలిలో కాలుష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత కాలుష్య నియంత్రణ మండలి తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఎక్కడకు వెళ్లినా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలనేది ఆశయం.

పుల్వామా అమర జవాన్లకు ఘన నివాళి



తగరపువలస బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో పుల్వామా దాడి ఘటనను విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస/ఆనందపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) జమ్ము కశ్మీరు రహదారిపై 2019 ఫిబ్రవరి 14న సైనికుల వాహనంపై ఆత్మాహుతి దాడి జరిగిన విషయాన్ని శుక్రవారం తగరపువలస బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ దాడిలో 40 మంది సెంట్రల్ రిజర్వు ఫోర్సు (సి.ఆర్.పి.ఎఫ్)కు చెందిన సైనికులు మరణించారని ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు వివరించారు. దేశం కోసం అసువులు బాసిన వారికి అంతా కలిసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి డైట్ అధ్యాపకులు ఎస్.త్రినాథరావు ముఖ్య అతిథిగా విచ్చేసి దాడి గురించి వివరించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయుల డైరీలు, టీచింగ్ నోట్సు, పాఠ్య ప్రణాళికలు, బోధనాభ్యసన సామగ్రిని పరిశీలించారు ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఉపాధ్యాయ శిక్షణార్థులు హరిప్రియ, శృతి, గౌతమిలకు కూడా వివిధ విషయాలను తెలియజేశారు. ఆయన అడిగిన వివిధ విషయాలకు చక్కని సమాధానం చెప్పిన సిహెచ్ వెంకటరమణకు బహుమతి అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లిక, సంజీవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఆనందపురం భారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వీరజవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జైజవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, కోశాధికారి కుప్ప రామలక్ష్మిలు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇదో చీకటి రోజని పేర్కొన్నారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి వీరజవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీబీఎస్ కలకలం

... 5వ పేజీ తరువాయి

బారినపడినట్టయితే ఒక్కసారిగా కాళ్లు, చేతులు పడిపోవడం జరుగుతుంది. ఒక్కోసారి ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ఆయాసం పెరిగిపోయి చనిపోయే అవకాశం కూడా ఉంటుంది. వ్యాధి మొదలైన వారం నుంచి రెండు వారాల తరువాత తీవ్రమై మళ్లీ తగ్గుముఖం పడుతుంది. మ్యాలీన్ పొర యథాస్థితికి వచ్చిన తరువాత రోగి కోలుకుంటాడు. ఇందుకోసం ఆటో ఇమ్యునో గ్లోబులిన్స్ వంటి మందులు అందిస్తారు.

నాడీ వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం

- డాక్టర్ కె రాంబాబు, విమ్స్ డైరెక్టర్

జీబీఎస్ వ్యాధి నాడీ వ్యవస్థను తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తుంది. వైరస్‌ల వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుంది.ఇది ఆటో ఇమ్యునో డిజార్డర్. పూర్తిగా నరాలపై దాడి చేస్తుంది. కాబట్టి ఒక్కసారిగా ఒక కాలు, ఒక చేయి పడిపోవడం, కొన్నిసార్లు రెండు కాళ్లు, చేతులు పడిపోవడం జరుగుతుంది. ఎక్కువసార్లు శ్వాసకోశ ఇబ్బందులకు దారితీసి ప్రాణం పోయేందుకు కారణమవుతుంది. సాధారణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు తరువాత ఈ వ్యాధి బారినపడుతుంటారు.

అరుదైన వ్యాధి కాదు. ఎప్పటి కప్పుడు ఇటువంటి కేసులు చూస్తుంటాం. రోగి పరిస్థితిని బట్టి అవసరమైన మందులు అందించి కోలుకునేలా చేస్తాం.

మిత్రధర్మంలో రాముడు ఆదర్శం

రామాయణ ప్రవచనంలో బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు



వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

కొమ్మాది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కష్టంలో ప్రతి వ్యక్తికి మంచి మిత్రుడు ఎంత అవసరమో రామాయణం తెలియచేస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాల ఆవరణలో శుక్రవారం అరణ్యకాండలోని పలు విషయాలను వివరించారు. రామలక్ష్మణులు కౌంచారణ్యం దాటి ముందుకు వెళ్లగా అక్కడ అయోముకి అనే రాక్షసి లక్ష్మణునిపై మనసు పడి ఆయనను ఆకర్షించడానికి ప్రయత్నించగా ధర్మాచరణ తత్పరుడైన లక్ష్మణుడు ఆమెను శిక్షించిన తీరును వివరించారు. కబంధుని వృత్తాంతాన్ని వివరించారు. అరణ్యకాండ పూర్తయిన సందర్భంగా శ్రీరామాయణ కావ్యకర్త, ఆదికవి వాల్మీకి మహర్షి స్వరూపంగా భావించి ప్రముఖ గ్రంధకర్త, ఆంధ్రవిశ్వవిద్యాలయ విశ్రాంత తెలుగు ఆచార్యుడు బ్రహ్మశ్రీ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ ప్రతిభ



వినీల్ దీక్షిత్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బీసీఏ కోర్సు అభ్యసిస్తున్న వినీల్ దీక్షిత్ ఎన్‌సీసీలో ప్రతిభ కనబరిచి ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో తెలుగు రాష్ట్రాల నేవీ యూనిట్‌కు ప్రాతినిధ్యం వహించాడు. జాతీయ స్థాయిలో 2500 మంది కేడెట్‌లతో పోటీ పడి ప్రతిభ ఆధారంగా అగ్రనేతల ముందు పరేడ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేశాడని గీతం క్రీడా విభాగం డైరెక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. పలు జాతీయ స్థాయి క్యాంప్‌లలో సైతం ఎంపికైన వినీల్‌దీక్షిత్ ఎన్‌సీసీ నౌకాదళ యూనిట్ ఉత్తమ కేడెట్‌గా నిలిచాడని ఆయన అభినందించారు.

నాలా పన్ను ఎగవేత

... 5వ పేజీ తరువాయి

ఆ భూమిలో భవన నిర్మాణాలకు జీవీఎంసీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జీవీఎంసీ అధికారులుభవన నిర్మాణాలకు వచ్చే దరఖాస్తులను పరిశీలించేటప్పుడు ప్రతిపాదిత భూమి/స్థలం వినియోగ స్వభావం నివాసయోగ్యమైనదేనా?, కాదా?..అని పరిశీలించాల్సి ఉంటుంది. ఒకవేళ నివాసయోగ్యం కాకుండా వ్యవసాయ స్వభావంలోనే ఉంటే మాత్రం నాలా పన్ను చెల్లించాలని ప్లాన్‌ను షార్ట్ ఫాల్‌లో పెట్టాల్సి ఉంటుంది. తాను తర్వాత చెల్లిస్తానని జీవీఎంసీ అధికారులకు దరఖాస్తుదారుడు లిఖిత పూర్వకంగా హామీ ఇస్తే ప్రత్యేక పరిస్థితుల్లో భవన నిర్మాణం పూర్తిచేసేలోగా నాలా చెల్లించాలనే షరతుపై ప్లాన్ జారీచేయాలి. కానీ నగరంలో చాలాచోట్ల నాలా లేకుండానే వ్యవసాయ భూముల్లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

జీవీఎంసీ పరిధిలో రూ.120 కోట్లు వరకు నాలా బకాయిలు

నాలా పన్ను కట్టకుండా భవన నిర్మాణాలు చేపడితే రెవెన్యూ అధికారులు ఆయా యజమానులకు భూమి విలువలో 50 శాతం నుంచి వంద శాతం వరకూ జరిమానా విధించేందుకు అవకాశం ఉంటుంది. కానీ రెవెన్యూ అధికారులు నాలా పన్ను చెల్లించకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నా...ఎందుచేతనో పట్టించుకోవడం లేదు. అధికారులు, సిబ్బంది వ్యక్తిగతంగా లబ్ధి పొందుతుండడం వల్లే భవన నిర్మాణాలకు అభ్యంతరం చెప్పడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ అధికారులు కూడా నాలా పన్ను చెల్లించకపోయినా భవన నిర్మాణాలకు నిరభ్యంతరంగా ప్లాన్ జారీచేయడంతోపాటు తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు కూడాజారీ చేసేస్తున్నారు. ఉదాహరణకు కూర్మన్నపాలెంలో ఒకరు 9.5 ఎకరాల్లో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీకి నాలా పన్ను కింద సుమారు రూ.3.5 కోట్లు కట్టాల్సి ఉంటుంది. కానీ చెల్లించకపోయినా ప్లాన్ జారీచేయడంతోపాటు ఇటీవలే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కూడా జారీ చేసేసినట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే మరొకరు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ భూమికి నాలా పన్ను కింద రూ.1.5 కోట్లు చెల్లించాల్సి ఉన్నా...కట్టలేదని సమాచారం. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు ప్లాన్, ఓసీ జారీ చేసేశారు. ఏదైనా భవన నిర్మాణం పూర్తయిన తర్వాత జీవీఎంసీ అధికారులు ఓసీ జారీచేయకపోతే...వాటికి రెవెన్యూ విభాగం అధికారులు వంద శాతం అదనపు పన్ను విధించవచ్చు. తద్వారా జీవీఎంసీకి ఆదాయం పెరుగుతుంది. కానీ నాలా పన్ను కట్టకపోయినా టౌన్‌ప్లానింగ్ విభాగం ఓసీ జారీ చేసేస్తుండడంతో సాధారణ ఆస్తి పన్ను మాత్రమే జీవీఎంసీకి చేరుతోంది. ఈ విధంగా జీవీఎంసీ సుమారు రూ.120 కోట్ల మేర ఆదాయం కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. దీనిపై విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు అందడంతో రహస్యంగా విచారణ జరుపుతున్నట్టు తెలిసింది. దీంతో జీవీఎంసీ, రెవెన్యూ అధికారుల్లో ఆందోళన మొదలైంది.

'గృహమిత్ర' ధరలపై జనం గగ్గోలు

- ధరల పట్టికపై జనవరి నెల రేట్లు
- ఆ ప్రకారమే సరుకుల అమ్మకం
- పట్టించుకోని రైతుబజార్ సిబ్బంది
- అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ కొనుగోలుదారుల ఆగ్రహం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పెదవాల్తేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అసలే నిత్యం పెరుగుతున్న ధరలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతుంటే పెదవాల్తేరు రైతుబజార్‌లో కొన్ని సరుకులు అధిక ధరలకు విక్రయిస్తుండడంతో కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలు, పండ్లు, నిత్యావసర సరుకులు అందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ నియమ నిబంధనల ప్రకారం రైతుబజార్లలో సరుకులను విక్రయిస్తోంది. ఇందుకోసం ఆ రోజు ఉండే ధరను తెలిపేలా పట్టికను ఏర్పాటు చేసింది. ఆ ప్రకారం రైతుబజార్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

అయితే పెదవాల్తేరు రైతుబజార్‌లో ధరల పట్టికలో వివరాలు పాతవే ఉంటున్నాయి. వివిధ సామానుల ధరలు తగ్గుతున్నా తక్కువ ధరకు విక్రయించడం లేదని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఈ రైతుబజారులో కూరగాయల స్టాల్స్‌తో పాటు గృహమిత్ర, సూపర్ మార్కెట్, డీసీఎంఎస్ స్పెషల్ కౌంటర్ ఉన్నాయి.


అధిక ధరలతో ఉన్న పాత ధరల పట్టిక



శుక్రవారం మార్చిన ప్రస్తుత ధరలు

అయితే ఈ షాపుల్లో ధరల పట్టికలో జనవరి నుంచి ఉన్న పాత ధరలనే సూచిస్తున్నారు. దీని గురించి ఎస్టేట్ అధికారి, మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అంటూ కొనుగోలుదారులు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లే రైతుబజార్ సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైతుబజార్ నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

హెచ్చరించాం

ఇక్కడ గృహమిత్ర, సూపర్ మార్కెట్, డీసీఎంఎస్ స్పెషల్ కౌంటర్ ఉన్నాయి. ఇంత వరకూ ఈ షాపుల నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. సూపర్‌బజార్ రేట్లు కంటే ఎక్కువ ధరలకు నిత్యావసర సరుకులు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ధరల విషయంలో గృహమిత్ర, సూపర్ మార్కెట్, డీసీఎంఎస్ స్పెషల్ కౌంటర్ షాపుల నిర్వాహకులకు అధిక ధరలకు విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించాం. ఇక మీదట పొరపాటు జరగకుండా చర్యలు తీసుకుంటాం.



- సత్యకళ, ఎస్టేట్ అధికారి, పెదవాల్తేరు రైతు బజార్


దామోదరం సంజీవయ్యకు నివాళి అర్పిస్తున్న వీసీ, అధ్యాపకులు, విద్యార్థులు

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారంఏయూలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపాలన భవనం వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ జి.శశిభూషణరావు ఇతర అధికారులు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్, డీన్లు, డైరెక్టర్లు, వివిధ విభాగాల అధిపతులు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'పై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ఏఎస్ఐ వెంకటేశ్వరరావు

పెదవాల్తేరు,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మహిళా పోలీసు స్టేషన్ (ఎండాడ) ఏసీపీ సీహెచ్ పెంటారావు సూచనల మేరకు ఈస్టు పాయింట్ కాలనీలో గల కేడీపీఎం స్కూలులో 8, 9వ తరగతి విద్యార్థులకు శుక్రవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లైంగిక వేధింపులపై స్టేషన్ ఏఎస్ఐ టీశెట్టి వెంకటేశ్వరరావు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లైగింక వేధింపులకు ఎవరైనా పాల్పడితే డయల్ 112కు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడవద్దు అని, తోటి విద్యార్థులను బాధకు గురి చేయవద్దని, యువత మత్తుకు బానిస కాకుండా, క్రమ శిక్షణతో కుడిన విద్యను అలవర్చుకొని ఉత్తమ భావి భారత పౌరులుగా ఎదగాలని కోరారు. క్షణికావేశంలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు)14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళ దుంపలు 13, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)45, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 34, కీరదోస 30, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 26, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్రాయ్‌లర్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

జీరో శాతం రోడ్డు ప్రమాదాలు లక్ష్యం కావాలి

- రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశంలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి


ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులతో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పోలీసు, ఆర్టీసీ సిబ్బంది జీరో శాతం రోడ్డు ప్రమాదాలు, జీరో శాతం ట్రాఫిక్ జామ్ లక్ష్యంతో పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. మద్దిలపాలెం సిటీ ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథి పాల్గొన్నారు. ఆర్టీసీ, పోలీస్ శాఖలు కలిసికట్టుగా పని చేస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ డ్రైవర్లకు వైద్య తనిఖీలు నిర్వహించాలని సూచించారు. డ్రైవర్లు ఎక్కువ సమయం కూర్చొని విధులు నిర్వహించడం వల్ల మెడ, వెన్నుపూస సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అందుకే బస్సు ఆగిన ప్రాంతంలో డ్రైవర్లు కిందకి దిగి నడవడం చేయాలని, అలాగే బస్సు మెడ కిందకి దించి ఎక్కువ సమయం డ్రైవ్ చేయకూడదని సూచించారు. యాభై, అరవై మంది ప్రయాణికులతో వెళ్లే బస్సు డ్రైవర్ మానసికంగా, శారీరకంగా, ఆలోచన పరంగా ఫిట్‌గా ఉండాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా విధుల్లోకి వెళ్లకూడదన్నారు. కంటి చూపు, బీపీ, మధుమేహం సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసి విధుల్లోకి పంపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. బస్సుల్లో విద్యుదాఘాతం వంటి కాకుండా విద్యుత్ ఎలాక్ట్రికల్ ఆడిట్ చేయాలన్నారు. అలాగే ఆర్టీసీ డ్రైవర్లకు పోలీస్ సిబ్బంది పరంగా ఎలాంటి ఇబ్బందులు కలిగిన 24/7 తన 7995095799 నంబర్‌కు సందేశం లేదా కాల్ చేసి తెలియజేయాలని చెప్పారు.

ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది జీరో శాతం రోడ్డు ప్రమాదాలకు కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో 100 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయన్నారు. ఆర్టీసీ బస్టాప్‌ల వద్ద ఇతర వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల బస్సులకు ఇబ్బందిగా ఉందని పోలీసులు దృష్టి సారించాలని కోరారు. ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేయగా 12 మంది ఫిట్ లేరని రిపోర్టులు వచ్చాయని వారిని విధుల్లోకి పంపించకుండా వైద్యం చేసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. అనంతరం జీరో ప్రమాదాల్లో జోన్ లెవల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్న ఎస్ఏఎన్. రాజు, కేవై నాయుడు, జిల్లాలో మొదట మూడు స్థానాల్లో నిలిచిన పీఎస్ వాసు, పీవీపీ రాజు, సీహెచ్‌ఏ రెడ్డి, మరో 13 మందికి సన్మానించారు. కార్యక్రమంలో డీటీసీ శ్రీనివాస్, ఏయూ ఆచార్యులు వెంకటరావు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోకుల్‌పార్కు తీరంలో స్వచ్ఛభారత్


తీరం శుభ్రం చేస్తున్న యువత

రామ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఫేనోమా సాఫ్ట్‌వేర్ సీఎంఆర్ విభాగం, బాయిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వైజాగ్ బీచ్‌లో శుక్రవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. సుమారు వంద మందికి పైగా ఫేనోమా ఉద్యోగులు వైజాగ్ వాలంటీర్స్ సహకారంతో గోకులు పార్కు బీచ్ నుంచి బీచ్ రోడ్డు వరకూ చెత్తాచెదారాలను ఏరివేశారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా సముద్ర తీరాలను పరిశుభ్రం చేస్తున్నట్టు చెప్పారు. ప్రకృతిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేవలం ఉద్యోగాలు చేయడంతో సరిపెట్టుకోకుండా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సాంత్వన లభిస్తుందన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఒక్క అడుగు ఆక్రమణకు గురైనా అధికారులదే బాధ్యత

- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడండి
- కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన విశాఖ డివిజన్ రెవెన్యూశాఖ సమావేశంలో ఫ్రీ హోల్డ్, భూముల క్రమబద్ధీకరణ, ఆక్రమణల తొలగింపు,ఎన్‌ఓసీ పత్రాల జారీ, సర్వే మ్యుటేషన్ ప్రక్రియ, 22ఏ భూములడీ నోటిఫికేషన్, కోర్టు కేసులపై స్పందన, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల జారీ, ఇతర రెవెన్యూ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక వాతావరణంలో వినతులకు సకాలంలో సమాధానం చెప్పాలని, సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సులభతర రీతిలో రెవెన్యూ సేవలు అందిం చాలని హితవు పలికారు. కొత్తగా ఒక్కఅడుగు స్థలం ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సర్వే, రెవెన్యూ శాఖల సహకారంతో దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, ఇతర విభాగాల సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన నాగాలాండ్ విద్యార్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అధ్యయన యాత్రలో భాగాంగా నాగాలాండ్ యూనివర్సిటీ కోహినూర్ క్యాంపస్ వాణిజ్య విభాగం విద్యార్థులు శుక్రవారం విశాఖపట్నం పోర్టును సందర్శించారు.

రాష్ట్రాభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి

- ఏడు నెలల్లో ఏపీకి భారీగా నిధులు
- విశాఖ ఉక్కు పరిశ్రమకు ఎలాంటి ఢోకా లేదు
- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. ఒంగోలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చిన ఏడు నెలల కాలంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రూ.3 లక్షల కోట్ల నిధులను కేంద్రం ఇచ్చిందన్నారు. అమరావతి నిర్మాణం, పోలవరం, విశాఖ రైల్వే జోన్, రామాయపట్నంలో బీపీసీఎల్ టెర్మినల్, అమరావతికి రైల్వే మార్గాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారన్నారు. దేశంలోనే అత్యున్నతమైన స్టీల్‌ప్లాంట్ విశాఖలో ఉందన్నారు. నష్టాల్లో ఉన్న పరిశ్రమను గతంలో కేంద్రం ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనలోఉండేదన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆ పరిశ్రమ గుండెకాయ వంటిదని గుర్తించి రూ.11,400 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. భవిష్యత్‌లో కూడా స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. 2030 నాటికి దేశంలో 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీలు స్టీల్‌ప్లాంట్‌పై బాధ్యతా రహిత ప్రకటనలు చేస్తున్నాయని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం ఉంటే ఎందుకు ఆర్థిక ప్యాకేజీని ప్రకటిస్తుందని శ్రీనివాసవర్మ ప్రశ్నించారు. 7.3 మిలియన్ టన్నుల ఉక్కుఉత్పత్తి చేయడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాటలోకి తెచ్చేందుకు కేంద్రం చర్యలు తీసుకుందన్నారు. త్వరలోనే ఉద్యోగుల పెండింగ్ జీతాలు చెల్లిస్తామని ఆయన పేర్కొన్నారు.



కార్మిక సంఘాల తీరు గర్హనీయం

తగరపువలస, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జూట్ మిల్లు యాజమాన్యం తన భూములను అమ్ముకోవడాన్ని నిలువరించాలని కార్మిక సంఘాలు ఇప్పుడు గగ్గోలు పెట్టడం సరికాదని పూర్వపు జూట్ కార్మిక నాయకుడు చిల్ల వెంకటరెడ్డిఒక ప్రకటనలోవిమర్శించారు. మిల్లు మూతపడిన తర్వాత చాలాకాలం యాజమాన్యం ఉలుకూ పలుకు లేకుండా ఉండిపోయిందని, తర్వాత హఠాత్తుగా 16 విభాగాలలో విలువైన ఇనుప సామగ్రిని తరలించడానికి ప్రయత్నించిందన్నారు. అప్పట్లో తాను అడ్డుపడినా, కార్మిక సంఘాలేమీ సహకరించలేదన్నారు. భవనాలు కూలగొట్టడం, యంత్రాలను తరలించడం జరిగిపోయిందని, మిల్లుకు చెందిన భూములను చదును కూడా చేయించారని అన్నారు. ఇప్పుడు కార్మికసంఘాలు మేల్కొని భూములు అమ్మ కుండా నిషేధించాలని కోరుతున్నారని అన్నారు. అప్పుడే స్పందించి ఉంటే సమస్య ఇంతవరకు వచ్చేది కాదని వెంకటరెడ్డి అన్నారు.

శేషగోపాలన్‌కు సంగీత విద్యానిధి బిరుదు ప్రదానం


శేషగోపాలన్‌ను సత్కరిస్తున్న అకాడమీ ప్రతినిధులు, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం శివగంగ సంగీత పరిషత్ ఆంధ్ర మ్యూజిక్ అకాడమీ నిర్వాహకులు కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసుడు, 'పద్మభూషణ్' మదురై టీఎన్‌శేషగోపాలన్‌కు సంగీతవిద్యానిధి బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆంధ్ర మ్యూజిక్ అకాడమీ 22వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా తమిళనాడుకు చెందిన శేషగోపాలన్‌కు సంగీత విద్యానిధి బిరుదు ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. హరికథా గానంలో నైపుణ్యం పొందడమే కాకుండా అనేక గాత్రకచేరీలు చేసిన సంగీత విద్వాంసులని కొనియాడారు.

అనంతరం చెన్నైకి చెందిన వోకల్ విద్వాంసులు టీఎన్ఎస్ కృష్ణ అందించిన స్వర కచేరి అలరించింది. వయోలిన్‌పై కేవీ కృష్ణ, మృదంగంపై కొత్తపల్లి రమేష్, ఘటంపై ఎస్.హేమంత్‌కుమార్ వాయిద్య సంగీత సహకారం అందించారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి శేషయ్ శాస్త్రి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఏయూ వీసీ శశిభూషణరావుతో మాట్లాడుతున్న నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా

దేశ రక్షణ కోసం పరిశోధనా సహకారం అందించండి

- ఏయూ వీసీతో తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణలో ఎదురవుతున్న అనేక సాంకేతిక సవాళ్లను అధిగమించే దిశగా ఏయూ పరిశోధన సహకారం అందించాలని తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన బృందంతో ఏయూను సందర్శించారు. అనంతరం వర్సిటీ ఉపకులపతి జి.శశిభూషణరావుతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా సమీర్ సక్సేనా ప్రత్యేకంగా మాట్లాడుతూ రక్షణ రంగానికి అవసరమైన వివిధ పరిశోధన సంబంధం అవసరాలపై చర్చించారు. శత్రుదేశాల నుంచి తమకు ఎదురవుతున్న సమస్యలను అధిగమించడానికి, పరిష్కరించడానికి అవసరమైన శాస్త్రీయ అధ్యయనాలు జరిపి సూచనలు అందించాలని ఏయూను కోరారు. ఏయూ ముందుకు వస్తే తాము దీనికి అవసరమైన ప్రాజెక్టులను మంజూరు చేయడానికి సంసిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, పలువురు ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులను సంరక్షణ అందరి బాధ్యత


చర్చావేదికలో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ తనూజముంగరవాడి తదితరులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణులను సంరక్షిస్తేనే భావితరాలు మన సహజ ప్రపంచాన్ని, అందులోని నివసించే అద్భుతమైన జాతులను ఆస్వాదించే అవకాశం కలుగుతుందని ప్రముఖ సిటిజన్ శాస్త్రవేత్త డాక్టర్ తనూజ ముంగరవాడి పేర్కొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ అండ్ సిటిజన్ సైన్స్ చర్చ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కాలుష్యం వల్ల ఏర్పడే వాతవరణ మార్పులు వన్యప్రాణులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. కాలుష్య కారకాల వినియోగంతో ప్రకృతితో పాటు జీవరాశికి కూడా ముప్పు ఏర్పడుతుందన్నారు. చమురు, విద్యుత్, ప్లాస్టిక్, రసాయనాలు వినియోగం వలన పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. వాటిని గ్రహించి మొక్కలు, చేపలు, ఇతర జాతులు కనుమరుగవుతున్నాయన్నారు. ప్రకృతిని కాపాడి వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, జేసీఐ అధ్యక్షుడు అద్నాన్ సబ్వాల, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు విజయప్రతాప్, రామారావు, శాంతిప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సదస్సు


సదస్సులో పాల్గొన్న రిసోర్స్ పర్సన్లు, అధ్యాపకులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ)పై రెండు రోజుల వర్క్‌షాప్ శుక్రవారం ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగింది. ముదునూరు డ్రీమ్స్ అకాడమీ, డాక్టర్ పల్లం సెట్టి సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో రీసోర్సు పర్సన్‌లు ప్రొఫెసర్ ఎస్.పల్లంసెట్టి, వీర్ నాగరాజు, డ్రీమ్స్ అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మన్ ఎంఎస్‌రాజు ముదునూరు, స్కిల్ డెవలప్‌మెంట్ ఐ.శ్రీనివాసరావులు పాల్గొని పలు సూచనలు చేశారు. రిసోర్స్ పర్సన్‌లను కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.పద్మశ్రీ సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్‌లు, 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

విజేత విశాఖ ఆపరేషన్ సర్కిల్ జట్టు



విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆపరేషన్ సర్కిల్ విశాఖ జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 2 నుంచి 8వరకు నెల్లూరులో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో 33 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్పీడీసీఎల్ నెల్లూరు జట్టుపై 6 వికెట్ల తేడాతో విశాఖ జట్టు విజయం సాధించింది. విజేత జట్టును పర్యవేక్షక ఇంజనీర్లు జి.శ్యాంబాబు, పోలాకి శ్రీనివాసరావు, బీఎస్ నాయుడు ఇతర అధికారులు సత్కరించారు.

ఎట్టకేలకు విద్యార్థుల కల సాకారం

- ఆర్‌బీఎంయూపీ పాఠశాల అప్‌గ్రేడ్
- కొత్త విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలు
- ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే, డీఈఓ



జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏన్నో ఏళ్లుగా అక్కడ ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకే విద్యార్థులకు తరగతులు జరుగుతూ ఉండేవి. జీవీఎంసీ పరిధి 31వ వార్డు భానోజీరావు రమాదేవి ప్రాథమికోన్నత పాఠశాల (జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ) ఒకటి నుంచి ఎనిమిది వరకు చదువుకుంటూ, ఆడుకుంటూ...తమ బాల్యాన్ని చక్కగా కొనసాగించేవారు. తొమ్మిదో తరగతికి వచ్చామంటే చాలు.. ఇక్కడ నుంచి వేరే పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడేవారు. మరికొందరు విద్యార్థులు దగ్గరలోనే ఉన్న స్కూల్ నుంచి వేరే ప్రాంతానికి వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చేవి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను ఆంధ్రజ్యోతి పలుసార్లు కథనాలుగా ప్రచురించింది. ఇటీవల..'ఇక్కడే చదవాలని ఉంది' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల అప్‌గ్రేడ్ చేసే పనులు ప్రారంభించారు. 2025-26లో తొమ్మిదో తరగతికి, 2026-27కు పదో తరగతి అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి (కొత్త విద్యా సంవత్సరం) అడ్మిషన్స్ కూడా తీసుకోనున్నారు.

పాఠశాల ప్రస్థానం..

1960లో పాఠశాల ప్రారంభంలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఉండేది. 1962లో 6 నుంచి 7 వరకు అప్‌గ్రేడ్ చేశారు. 2014 నుంచి 8వ తరగతి చేరింది. అప్పటి నుంచి దాదాపు దశాబ్ద కాలం అప్‌గ్రేడ్ చేయలేదు. ఎన్నిసార్లు ప్రస్తావించినా పట్టించుకోనే నాథుడే కరువయ్యారు.

ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే, డీఈవో

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణకు విన్నవించారు. చొరవ చూపుతానని పాఠశాలను సందర్శించినప్పుడు ఆయన హామీ ఇచ్చారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడంతో పనులన్నీ వేగంగా సాగాయి. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ అప్‌గ్రేడ్ చేసేందుకు పూర్తిగా సహకరించారు.

పదో తరగతి ఇక్కడే అని ఊహించలేదు

పాఠశాలలోనే పదో తరగతి వరకు చదువుతానని ఊహించలేదు. పాఠశాల అప్‌గ్రేడ్ అవుతుందని తెలిసి ఆనందంగా ఉంది. ఇల్లు కూడా దగ్గరగా ఉండటంతో ఎటువంటి భయం లేకుండా ఇక్కడే పదో తరగతి వరకు చదువుకోవచ్చు. నా తోటి విద్యార్థినీ, విద్యార్థులు అందరూ సంతోషిస్తున్నారు.

-జి.హిమబిందు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొదటి నుంచి ఇక్కడే చదువుకున్నా

మొదటి నుంచి ఇక్కడే చదుకుంటున్నాను. ఈ ఏడాది తరువాత ఎక్కడ జాయిన్ అవ్వాలా అన్న సందేహం ఉండేది. తమ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారని ఇప్పుడే చెప్పడంతో చాలా సంతోషంగా ఉంది.

-కె.లోకేష్

విద్యార్థుల కోసమే నిర్ణయం..

విద్యార్థుల కోసమే వెంటనే నిర్ణయం తీసుకున్నాం. తొలుత అప్‌గ్రేడ్‌కు అవకాశం లేదు. అయితే పాఠశాలలో అవసరం మేరకు తరగతి గదులు ఉండటంతో దస్త్రాన్ని వేగంగా ముందుకు కదిలించాం. దీనిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేకంగా ఆదేశించడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అప్‌గ్రేడ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం.



-ఎన్.ప్రేమ్‌కుమార్
జిల్లా విద్యాశాఖాధికారి

విద్యకు అధిక ప్రాధాన్యత

కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. పాఠశాలను రెండు సందర్భాల్లో సందర్శించినప్పుడు విద్యార్థులు, తల్లిదండ్రులు విన్నవించడంతో అప్‌గ్రేడ్ కోసం ప్రయత్నాలు ప్రారంభించా. విద్య విషయంలో వెనుకాడవద్దని సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి చెప్పడంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోగలిగాం. డీఈఓ ప్రేమ్‌కుమార్ వేగంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పని జరిపించారు.



- వంశీకృష్ణ, ఎమ్మెల్యే

ఆనందంగా ఉంది

కొద్ది నెలల్లోనే ఉద్యోగ విరమణ పొందుతున్నా. ఈ పాఠశాలకు వచ్చినప్పటి నుంచి ఎన్నో సార్లు అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూనే ఉన్నా. అయితే ఇప్పటికి కల సాకారమైనందుకు సంతోషంగా ఉంది. విద్యార్థులకు పాఠశాల విద్య పూర్తిగా ఒకే దగ్గర దొరకడంతో వారి ఆలోచనలు పదిలంగా, దృఢంగా ఉంటాయి. పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నదే నా ఆకాంక్ష.



-హనుమంతు ప్రభాకర్, హెచ్‌ఎం

పోర్టును సందర్శించిన నాగాలాండ్ విద్యార్థులు


పోర్టు అధికారులతో నాగాలాండ్ వర్సిటీ విద్యార్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అధ్యయన యాత్రలో భాగాంగా నాగాలాండ్ యూనివర్సిటీ కోహినూర్ క్యాంపస్ వాణిజ్య విభాగం విద్యార్థులు శుక్రవారం విశాఖపట్నం పోర్టును సందర్శించారు. పోర్టులో ఆర్థిక అవకాశాలు, ఎగుమతి, దిగుమతి సౌకర్యాలు, నిర్వహణ తదితర అంశాలను అధికారులు వివరించారు. ప్రపంచవాణిజ్యంలో పోర్టుల పాత్ర, మౌలిక వసతులు, సముద్ర అనుసంధానం, ఆధునిక సదుపాయాలు, కార్గోహ్యాండ్లింగ్ సామర్థ్యం విద్యార్థులకు తెలిపారు. కస్టమ్స్ క్లియరెన్స్, గోదాముల నిర్వాహణ, షిప్పింగ్ విధానాలు వంటి రంగాలపై అవగాహన కల్పించారు.

విజేత విశాఖ ఆపరేషన్ సర్కిల్


విజేత జట్టును సత్కరిస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆపరేషన్ సర్కిల్ విశాఖ జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 2 నుంచి 8 వరకు నెల్లూరులో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో 33 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్పీడీసీఎల్ నెల్లూరు జట్టుపై 6 వికెట్ల తేడాతో విశాఖ జట్టు విజయం సాధించింది. విజేత జట్టును పర్యవేక్షక ఇంజనీర్లు జి.శ్యాంబాబు, పోలాకి శ్రీనివాసరావు, బీఎస్ నాయుడు ఇతర అధికారులు సత్కరించారు.

వివాహిత ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

నిర్ధారించారు. దీంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి వెంకటరమణ శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.అతడి వద్ద కామవాంఛ ను ప్రేరేపించేమాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

రహదారి భద్రతపై వైద్యవర్గాల చొరవ అభినందనీయం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై కేజీహెచ్ నుంచి కలెక్టరేట్ వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ, రోటరీక్లబ్, వివిధ సంస్థలతో కలసి నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో వైద్యవర్గాలు కృషి చేయడం అభినందనీయమని ప్రశంసించారు. సామాన్యులు రహదారి నియమాలు పాటించేందుకు ఇది సానుకూల ప్రభావం చూపిస్తుందని అభిప్రాయడ్డారు. ఈ కార్యక్రమంలో రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, పి.బాలసతీష్, కేజీహెచ్ వైద్యులు, అధికారులు, నర్సింగ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల కోసం వినతి


వంశీనగర్‌లో స్థానికులతో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 50వవార్డులో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు జీవీఎంసీ అధికారులు, స్థానిక నాయకులతో కలసి శుక్రవారం పర్యటించారు. హైవే పక్క నివాసిత ప్రాంతంగా ఉన్న వంశీనగర్‌లో స్థానికులతో ఆయన మాట్లాడారు. తమ కాలనీ రోడ్లు విస్తరించాలని వారు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయమై ఆయన అక్కడే అధికారులతో చర్చించారు. అనంతరం కాలనీలో సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు వెంకటరావు, పార్టీ నాయకులు విజయచంద్రుడు, రామచంద్రరావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్‌లు హాజరయ్యారు.

'కులగణన ద్వారా రాజ్యాధికారం'


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సమన్వయ కమిటీ ఛైర్మన్ మల్లేశ్వరరావు

సీతంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కుల గణన జరిపించి బహిర్గతం చేయాలని బీసీ సమన్వయ కమిటీ ఛైర్మన్ కట్టా మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం కరువైందన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీల సమస్యలు ప్రస్తావించే నాయకత్వం లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. కులగణన ద్వారా మన బలాన్ని చూపి రాజ్యాధికారం పొందడం ద్వారా హక్కులు సాధించుకోవాలని నిర్ణయించామన్నారు. తొలుత జిల్లా బీసీ సమన్వయ కమిటీ నియామకం జరిపారు. ఛైర్మన్‌గా కట్టా మల్లేశ్వరరావు, కన్వీనర్‌గా పెదపెంకి శివప్రసాద్, అధికార ప్రతినిధిగా పాలిశెట్టి మహాలక్ష్మినాయుడు, కో -కన్వీనర్‌లుగా సీహెచ్ శ్రీనివాసరావు, కాండ్రేగుల వెంకట ఉమామహేష్, పల్లా వెంకట అప్పారావు తదితరులను నియమించారు.

'సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి'


జనసేన నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వార్డులో ఉన్న ప్రజల సమస్యలు పార్టీ అధ్యక్షులు, ముఖ్యమైన నాయకులు తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దక్షిణ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ ఆధ్వర్యంలో వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమస్యలను వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఉషశ్రీ, కంటిపాము పరమేశ్వరి పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలమాలలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఉచిత అన్న ప్రసాద వితరణకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ వినియోగం ప్రకృతికి తీవ్ర నష్టం


గుడ్డ సంచులు ప్రదర్శిస్తున్న ఏడీసీ, జడ్సీ తదితరులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగంతో ప్రకృతికి తీవ్ర విఘాతం కలుగుతుందని, అందుకు దారితీసే పరిస్థితులను ప్రజలందరూ విడనాడాలని జీవీఎంసీ ఏడీసీ సోమ్మనారాయణ కోరారు. శుక్రవారం 41వ వార్డు సెబాస్టియన్ కాలనీలో జీవీఎంసీ సహకారంతో ప్రజాముఖి అర్బన్ లైవింగ్ లేబ్, టెరీ టీమ్ నిర్వహించిన కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ అభియాన్, వాతావరణ అనుకూలత, ప్రజల భాగస్వామ్యం వంటి విషయాలను వివరించారు. అనంతరం జీవీఎంసీ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, కళాశాల, పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ సునీల్ కుమార్, డీఈ రామ సుబ్బారావు, ఏపీడీ పుణ్యవతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్,కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బ్యాంకు ఉద్యోగుల ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘం నాయకుడు ఉదయ్‌కుమార్

సీతమ్మధార, ఫిబ్రవరి 14, (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లోని అన్ని క్యాడెర్లలో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, అయిదు రోజుల పని దినాలు అమలు పర్చాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఏఐబీఈఏ సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్, యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్ ఆర్.వసంతరావులు డిమాండ్ చేశారు. బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ల పిలుపు మేరకు నగరంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంక్ ఉద్యోగులంతా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బ్యాంక్‌ల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం ఆపాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, బ్యాంక్ బోర్డులో ఎంప్లాయిస్ వర్క్‌మెన్ డైరక్టర్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రెసిడెంట్ మహీంద్రా, రమేష్, ఆడారి శ్రీను, ఈశ్వర్, ప్రసాద్, శ్రీనివాస్, సుజాత, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్ ఒలింపిక్స్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రీడలు మానసికంగా, శారీరకంగా ఎంతో ఉపయోగపడతాయని ఇండియన్ ఫోర్స్ మాజీ కెప్టెన్ జేవీ సునీల్ కుమార్ అన్నారు. పోర్టు స్టేడియంలో పెన్ ఒలింపిక్స్ పెన్ స్కూల్ వార్షిక క్రీడలు శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. షాట్‌పుట్, ఖోఖో, కబడ్డీ సహా 25 ఈవెంట్లలో వెయ్యిమంది విద్యార్థులు పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఎన్‌సీసీ మార్చ్‌ఫాస్ట్, సామూహిక డ్రిల్ చేశారు. ఛైర్‌పర్సన్ అనితా పెరీరా మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతకు పెన్ స్కూల్ నిదర్శనమని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సంస్థ ముందుకు సాగుతుందని చెప్పారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సంజీవయ్య సేవలు అమూల్యం


సంజీవయ్య చిత్రపటం వద్ద కాంగ్రెస్ నేతల నివాళి

మహారాణిపేట/ జగదాంబ కూడలి/మురళీనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య సేవలు అమూల్యమని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శ్లాఘించారు. శుక్రవారం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో వేడుక నిర్వహించారు. ముందుగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంజీవయ్య సమాజానికి చేసిన సేవలను గుర్తుచేస్తూ, మంచి పాలనా దక్షత ఉన్న నేతగా కొనియాడారు. విశాఖలో నేషనల్ లా కళాశాలకు సంజీవయ్య పేరు పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రామారావు, బి.సి. సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, పీడీ లక్ష్మీపతి, ఏవో ఈశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. సంజీవయ్యనిష్కళంక నేత అని ఇన్‌చార్జి డీటీసీ ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు శ్లాఘించారు. నేటితరం రాజకీయ నాయకులకు, యువతకు ఆయన స్ఫూర్తి అని కొనియాడారు. శుక్రవారం సంజీవయ్య జయంతి సందర్భంగా మాధవధార రవాణా శాఖ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతోద్యోగులు, సిబ్బంది హాజరయ్యారు. సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు శ్లాఘించారు. నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ కె.వి.సూర్యనారాయణ, కస్తూరి వెంకటరావు, చెన్నా అప్పారావు, గుర్రం కనకరాజు, మాడుగుల సత్యనారాయణ, కిలాని వెంకటేష్, కొత్తపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత

సీతమ్మధార, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తిని అదుపులోకి తీసుకున్న నాలుగో పట్టణ పోలీసులు వైద్యం అందించి, అతడి తల్లికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఈ నెల 12న రైల్వే న్యూకాలనీ శివాలయం వద్ద ఓ వ్యక్తి దారిన పోయేవారిపై రాళ్లతో దాడి చేస్తున్నట్లు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో కానిస్టేబుల్ కె.రవికుమార్ ఘటన స్థలానికి వెళ్లి స్థానికుల సహాయంతో పోలీసు స్టేషన్‌కి తరలించారు. అతడు తమిళంలో మాట్లాడుతుండటంతో ఆ భాష తెలిసిన కానిస్టేబుల్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. తమిళనాడుకు చెందిన ముత్తులింగం ఏసుదాసుగా తెలుసుకుని తల్లిని రప్పించారు. ఈలోగా ఇంచార్జ్ సీఐ దాలిబాబు పర్యవేక్షణలో ఆ వ్యక్తిని మానసిక వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. స్టేషన్‌కి వచ్చిన తల్లి తన కుమారుడు డిగ్రీ చదివాడని, మూడేళ్ల క్రితం తన స్నేహితులతో జరిగిన గొడవలో తలకి గాయం తగలటంతో మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వచ్చేశాడని పోలీసులకు తెలిపింది. తమిళనాడు పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపింది. మానసిక వైద్యశాలకు తల్లిని తీసుకువెళ్లి కుమారుడిని అప్పగించారు.

పర్యాటకాభివృద్ధి ప్రకటనలకే పరిమితమా!

... 5వ పేజీ తరువాయి

తీసుకువచ్చి ఆర్‌డీగా నియమిస్తారని తెలిసి మళ్లీ కూటమి నేతల నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్టయింది. వైసీపీకి ఊడిగం చేసిన అధికారులనే తీసుకువచ్చి కీలక స్థానాల్లో ఎలా నియమిస్తారని ప్రశ్నించినట్టు తెలిసింది.

ఇక ఇటీవల ఇక్కడ ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. ఈ అధికారుల తీరు తెలిసి ఈ ప్రాంతానికి చెందినవారు ఎవరూ విశాఖలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రాలేదని, వచ్చిన వాటిలో అధికం రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు చెందినవేనని, ఈ విషయం కూడా పర్యాటక శాఖ పెద్దలు గుర్తించడం లేదని విశాఖ కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. విశాఖ పర్యాటక శాఖలో అధికారుల మధ్య సమన్వయం లేదు. ఈ నేపథ్యంలో పర్యాటక శాఖ అధికారులు తెచ్చే ప్రతిపాదనలు పూర్తిగా పరిశీలించకుండా ఓకే అంటే...ఏమి చిక్కులు వచ్చి పడతాయోనని జిల్లా ఉన్నతాధికారులు ఒకటికి, రెండుసార్లు ఆలోచించి వెనక్కి పంపేస్తున్నారు. దాంతో ఇక్కడ ఏదీ ముందుకు కదలడంలేదు. విశాఖలో అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య భారీగా పడిపోయింది. ఆ లెక్కలు కూడా బయటకు రానీయడం లేదు.

నేడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

... 5వ పేజీ తరువాయి

జనవరిలో 'న్యూ ఇయర్...క్లీన్ స్టార్ట్' అని అమలు చేశారు. ఇప్పుడు ఫిబ్రవరిలో 'మన మూలాలు..మన బలాలు' అనే అంశాన్ని తీసుకున్నారు. మన చరిత్ర ఏమిటి?, వనరులను ఎలా సద్వినియోగం చేసుకోవాలనేది దీని ఉద్దేశం. కాలుష్యం లేని పర్యావరణం, ఘన వ్యర్థాల సక్రమ నిర్వహణ, స్వచ్ఛమైన నీటి వనరులు, ఇళ్లు, అపార్టుమెంట్లు, కాలనీ, గ్రామాలు అన్నీ పరిశుభ్రంగా ఉండేలా అక్కడి వారిని భాగస్వాముల్ని చేయాలి. పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు, గుడులు, గోపురాలు, చర్చిలు, మసీదులు, పరిశ్రమల్లోను దీనిని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గాలిలో కాలుష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత కాలుష్య నియంత్రణ మండలి తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఎక్కడకు వెళ్లినా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలనేది ఆశయం.

జీబీఎస్ కలకలం

... 5వ పేజీ తరువాయి

బారినపడినట్టయితే ఒక్కసారిగా కాళ్లు, చేతులు పడిపోవడం జరుగుతుంది. ఒక్కోసారి ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ఆయాసం పెరిగిపోయి చనిపోయే అవకాశం కూడా ఉంటుంది. వ్యాధి మొదలైన వారం నుంచి రెండు వారాల తరువాత తీవ్రమై మళ్లీ తగ్గుముఖం పడుతుంది. మ్యాలీన్ పొర యథాస్థితికి వచ్చిన తరువాత రోగి కోలుకుంటాడు. ఇందుకోసం ఆటో ఇమ్యునో గ్లోబులిన్స్ వంటి మందులు అందిస్తారు.

నాడీ వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం

- డాక్టర్ కె రాంబాబు, విమ్స్ డైరక్టర్

జీబీఎస్ వ్యాధి నాడీ వ్యవస్థను తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తుంది. వైరస్‌ల వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుంది.ఇది ఆటో ఇమ్యునో డిజార్డర్. పూర్తిగా నరాలపై దాడి చేస్తుంది. కాబట్టి ఒక్కసారిగా ఒక కాలు, ఒక చేయి పడిపోవడం, కొన్నిసార్లు రెండు కాళ్లు, చేతులు పడిపోవడం జరుగుతుంది. ఎక్కువసార్లు శ్వాసకోశ ఇబ్బందులకు దారితీసి ప్రాణం పోయేందుకు కారణమవుతుంది. సాధారణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు తరువాత ఈ వ్యాధి బారినపడుతుంటారు.

అరుదైన వ్యాధి కాదు. ఎప్పటి కప్పుడు ఇటువంటి కేసులు చూస్తుంటాం. రోగి పరిస్థితిని బట్టి అవసరమైన మందులు అందించి కోలుకునేలా చేస్తాం.

నాలా పన్ను ఎగవేత

... 5వ పేజీ తరువాయి

ఆ భూమిలో భవన నిర్మాణాలకు జీవీఎంసీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జీవీఎంసీ అధికారులుభవన నిర్మాణాలకు వచ్చే దరఖాస్తులను పరిశీలించేటప్పుడు ప్రతిపాదిత భూమి/స్థలం వినియోగ స్వభావం నివాసయోగ్యమైనదేనా?, కాదా?..అని పరిశీలించాల్సి ఉంటుంది. ఒకవేళ నివాసయోగ్యం కాకుండా వ్యవసాయ స్వభావంలోనే ఉంటే మాత్రం నాలా పన్ను చెల్లించాలని ప్లాన్‌ను షార్ట్ ఫాల్‌లో పెట్టాల్సి ఉంటుంది. తాను తర్వాత చెల్లిస్తానని జీవీఎంసీ అధికారులకు దరఖాస్తుదారుడు లిఖిత పూర్వకంగా హామీ ఇస్తే ప్రత్యేక పరిస్థితుల్లో భవన నిర్మాణం పూర్తిచేసేలోగా నాలా చెల్లించాలనే షరతుపై ప్లాన్ జారీచేయాలి. కానీ నగరంలో చాలాచోట్ల నాలా లేకుండానే వ్యవసాయ భూముల్లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

జీవీఎంసీ పరిధిలో రూ.120 కోట్లు వరకు నాలా బకాయిలు

నాలా పన్ను కట్టకుండా భవన నిర్మాణాలు చేపడితే రెవెన్యూ అధికారులు ఆయా యజమానులకు భూమి విలువలో 50 శాతం నుంచి వంద శాతం వరకూ జరిమానా విధించేందుకు అవకాశం ఉంటుంది. కానీ రెవెన్యూ అధికారులు నాలా పన్ను చెల్లించకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నా...ఎందుచేతనో పట్టించుకోవడం లేదు. అధికారులు, సిబ్బంది వ్యక్తిగతంగా లబ్ధి పొందుతుండడం వల్లే భవన నిర్మాణాలకు అభ్యంతరం చెప్పడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ అధికారులు కూడా నాలా పన్ను చెల్లించకపోయినా భవన నిర్మాణాలకు నిరభ్యంతరంగా ప్లాన్ జారీచేయడంతోపాటు తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు కూడాజారీ చేసేస్తున్నారు. ఉదాహరణకు కూర్మన్నపాలెంలో ఒకరు 9.5 ఎకరాల్లో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీకి నాలా పన్ను కింద సుమారు రూ.3.5 కోట్లు కట్టాల్సి ఉంటుంది. కానీ చెల్లించకపోయినా ప్లాన్ జారీచేయడంతోపాటు ఇటీవలే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కూడా జారీ చేసేసినట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే మరొకరు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ భూమికి నాలా పన్ను కింద రూ.1.5 కోట్లు చెల్లించాల్సి ఉన్నా...కట్టలేదని సమాచారం. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు ప్లాన్, ఓసీ జారీ చేసేశారు. ఏదైనా భవన నిర్మాణం పూర్తయిన తర్వాత జీవీఎంసీ అధికారులు ఓసీ జారీచేయకపోతే...వాటికి రెవెన్యూ విభాగం అధికారులు వంద శాతం అదనపు పన్ను విధించవచ్చు. తద్వారా జీవీఎంసీకి ఆదాయం పెరుగుతుంది. కానీ నాలా పన్ను కట్టకపోయినా టౌన్‌ప్లానింగ్ విభాగం ఓసీ జారీ చేసేస్తుండడంతో సాధారణ ఆస్తి పన్ను మాత్రమే జీవీఎంసీకి చేరుతోంది. ఈ విధంగా జీవీఎంసీ సుమారు రూ.120 కోట్ల మేర ఆదాయం కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. దీనిపై విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు అందడంతో రహస్యంగా విచారణ జరుపుతున్నట్టు తెలిసింది. దీంతో జీవీఎంసీ, రెవెన్యూ అధికారుల్లో ఆందోళన మొదలైంది.

ఆక్రమణలపై సీపీకి ఫిర్యాదు

పెందుర్తిరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములతో పాటు రైతుల జిరాయితీ భూములను ఆక్రమిస్తున్నారని వరలక్ష్మీనగర్‌కు చెందిన కె.ఎస్.వి. మధుసూదనరావు శుక్రవారం నగర పోలీసు కమిషనరుకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఓ వ్యక్తి మైనారిటీ వర్గ నాయకుడిగా చెలామణీ అవుతూ భయభ్రాంతులకు గురిచేసి, ఆక్రమణలకు తెగపడుతున్నట్టు పేర్కొన్నారు. రైతులు సాగుచేస్తున్న ప్రభుత్వ భూములతో పాటు సర్వేనెంబరు 7/6లో జిరాయితీ భూములను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారని, అడ్డుకున్న వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని, రక్షణ కల్పించాలని కోరారు.

కార్మికుల భద్రత ముఖ్యం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):పని ప్రదేశంలో భద్రత ముఖ్యమని స్టీల్‌ప్లాంట్ జోనల్ భద్రత అధికారి బయ్యే మల్లయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ విభాగంలో శుక్రవారం ప్రాథమిక చికిత్స, అత్యవసర రెస్పాన్స్‌పై అవగాహన కల్పించారు. కార్మికుల భద్రతపై ప్లాంట్ ఆధారపడి ఉంటుందన్నారు. ఇబ్బందులుంటే అధికారులకు తెలపాలన్నారు. భద్రతా పనిముట్లను ధరించి విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విభాగం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

అగనంపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తలారి సాయి మహర్షిని పలువురు ఆదుకుఉన్నారు. స.హ.చట్టం ఉద్యమ కర్త పట్టా రామాఅప్పారావు దాతల సాయంతో సమకూర్చిన రూ.25 వేలు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మరింతమంది దాతలు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో విందుల వెంకటరమణ, బండారు చందు, వంశీ శ్రీనివాస్, లక్ష్మీనరసింహం, రామకృష్ణ, శశికాంత్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గోపాలపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 89వ వార్డు కొత్తపాలెం సంతోష్‌నగర్ యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. కాలనీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీవీ శేఖర్, కార్యదర్శిగా సుంకరలక్ష్మి, కోశాధికారిగా వీకే చారిటీ, సహాయ కోశాధికారిగా జి.రేణుక, సభ్యులుగా బి.లోకేశ్వరరావు, జీకే మూర్తి, బి.కామేశ్వరరావు, వీవీ సురేశ్, బి.వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సౌకర్యాలు కల్పించాలి

గాజువాక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఐ నాయకులు జోనల్ కమిషనర్ శేషాద్రికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. సత్యనారాయణ, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి తదితరులున్నారు.

సినిమా గైడ్

● **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),

● **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి

● **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),

● **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు) 14, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 22, బంగాళదుంపలు 13, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 70, అల్లం 45, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోసకాయలు 28, వెల్లుల్లి 150, కొబ్బరికాయ25, బీన్స్ (పెన్సిల్) 34, కీరదోస 30, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 26, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

పుల్వామా ఉగ్రదాడిలో అమర జవాన్లకు నివాళి



అగనంపూడిలో నివాళులర్పిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

అగనంపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్రం జంక్షన్‌లోని మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 40 మంది వీర జవాన్‌లకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు మాట్లాడారు. దేశ రక్షణ కోసం పాటు పడిన జవాన్‌లు ఉగ్రదాడిలో వీరమణం పొందడం దేశానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో గురు గోవింద్, గజేంద్రరరావు, కూర్మారావు, వేణు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జవాన్ల త్యాగం మరువలేం

గాజువాక: దేశ రక్షణలో అసువులు బాసిన పుల్వామా అమరుల త్యాగం మరువలేమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మృతులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో జవానులు ప్రాణాలు కోల్పోవడం దారుణమన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని మరిచిపోరాదన్నారు. ఈ కార్యక్రమంలో గూటూరు శంకరరావు, రంగనాయకులు, కృష్ణారెడ్డి, రామస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్‌లు పంపిణీ



విద్యార్థినులకు స్పోర్ట్సు కిట్లను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, సంస్థ నిర్వాహకులు

మల్కాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బాలికలు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.అరుణకుమారి పేర్కొన్నారు. పాఠశాలలో శుక్రవారం నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. దాదాపుగా 326 మంది విద్యార్థులకు ఎస్‌ఏలు పావని, వెంకటలక్ష్మి వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత మజ్జి సోమేశ్, జనసేన నాయకులు చంద్రమౌళి, నడిగట్ల శంకరమ్మ, పైడిరాజు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో మొక్కల పంపిణీ

శ్రీహరిపురం స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులకు శనివారం బౌద్ధ మత ప్రచారకులు దేవానంద మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. కాలుష్య నిరోధానికి విద్యార్థులు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొబైల్ వీడి పాఠాలపై దృష్టి సారించండి : సీఐ



విద్యార్థులతో సీఐ కేవీ సతీశ్‌కుమార్

పెందుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని స్థానిక సీఐ కేవీ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. చింతలగ్రహారం జడ్పీ పాఠశాలను బుధవారం సీఐ సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు ఈసందర్భంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యం నిర్ణయించి ఆ దిశగా సాధన చేయాలన్నారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి మత్తు బారిన పడవద్దని హెచ్చరించారు. ఏదైరా ఆపద వస్తే 112కి కాల్ చేస్తే పోలీసులు సకాలంలో స్పందిస్తారన్నారు

జీరో శాతం రోడ్డు ప్రమాదాలే లక్ష్యం: సీపీ



ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులతో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలీసు, ఆర్టీసీ సిబ్బంది జీరో శాతం రోడ్డు ప్రమాదాలు, జీరో శాతం ట్రాఫిక్ జామ్ లక్ష్యంతో పనిచేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. మద్దిలపాలెం సిటీ ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ డ్రైవర్లకు వైద్య తనిఖీలు నిర్వహించాలని సూచించారు. డ్రైవర్లు ఎక్కువ సమయం కూర్చొని విధులు నిర్వహించడం వల్ల మెడ, వెన్నెముక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అందుకే బస్సు ఆగిన ప్రాంతంలో డ్రైవర్లు కిందకి దిగి నడవాలని, మెడ కిందకి దించి ఎక్కువ సమయం డ్రైవ్ చేయకూడదని సూచించారు. యాభై, అరవై మంది ప్రయాణికులతో వెళ్లే బస్సు డ్రైవర్ మానసికంగా, శారీరకంగా, ఆలోచన పరంగా ఫిట్‌గా ఉండాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా విధుల్లోకి వెళ్లకూడదన్నారు. కంటి చూపు, బీపీ, మధుమేహం లేకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసి విధుల్లోకి పంపించాలని అధికారులకు సూచించారు. బస్సుల్లో విద్యుత్ ఎలాక్ట్రికల్ ఆడిట్ చేయాలన్నారు. డ్రైవర్లకు పోలీసుల పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 24/7 తన 7995095799 నంబర్‌కు సందేశం లేదా కాల్ చేసి తెలియజేయాలన్నారు.

ఏపీఎస్‌ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది జీరో శాతం రోడ్డు ప్రమాదాలకు కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో 100 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయన్నారు. ఆర్టీసీ బస్టాప్‌ల వద్ద ఇతర వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల బస్సులకు ఇబ్బందిగా ఉందని పోలీసులు దృష్టిసారించాలని కోరారు. ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేయగా 12 మంది ఫిట్ లేరని రిపోర్టులు వచ్చాయని వారిని విధుల్లోకి పంపించకుండా వైద్యం చేసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. అనంతరం జీరో ప్రమాదాల్లో జోన్ లెవల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్న ఎస్ఏఎన్. రాజు, కేవై నాయుడు, జిల్లాలో మొదట మూడు స్థానాల్లో నిలిచిన పీఎస్ వాసు, వీవీపీ రాజు, సీహెచ్ఏ రెడ్డి, మరో 13 మందికి సన్మానించారు. కార్యక్రమంలో డీటీసీ శ్రీనివాస్, ఏయూ ఆచార్యులు వెంకటరావు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ముగ్గురి అదృశ్యం



బట్ట రాజేశ్, అతడి తల్లి రాణి, పెనుమచ్చు చక్రమ్మ

- అంతా ఒకే కుటుంబ సభ్యులు
- 8వ తేదీ నుంచి కానరాని ఆచూకీ
- పట్టణ పోలీసుల ముమ్మర దర్యాప్తు

నర్సీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నర్సీపట్నం కాపు వీధిలో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అదృశ్యమయ్యారు. ఇందుకు సంబంధించి పట్టణ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం నీలంపేటకు చెందిన బట్ట రాణి, తల్లి చక్రమ్మ, పెద్ద కుమారుడు రాజేశ్, చిన్న కుమారుడు మోహన్‌తో కలిసి నర్సీపట్నం కాపువీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు రాజేశ్ తోపుడు బండిపై ఫ్యాన్సీ సామగ్రి అమ్ముకునేవాడు. చిన్న కుమారుడు మోహన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా రెండు నెలలుగా టీ దుకాణం నడుపుతున్నాడు. రాజేశ్ సుమారు రూ.10 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఆ విషయం కుటుంబ సభ్యులెవరికీ తెలియదు. అయితే ఫ్యాన్సీ సామగ్రి అమ్మకం లాభసాటిగా లేదని, టీ టైమ్ షాపులోనే తినుబండారాలు అమ్ముకుంటానని తమ్ముడు మోహన్‌తో అనడంతో ఇద్దరు కలిసి వ్యాపారం చేసుకుందామని అనుకున్నారు. మోహన్ షాపులో పెట్టుబడి పేరుతో ఈ నెల 6వ తేదీన తెలిసిన వారి దగ్గర రాజేశ్ మరో రూ.50 వేలు అప్పు చేశాడు. ఈ విషయం తెలిసి...ఆ డబ్బులు ఏమయ్యాయని మోహన్ ఈ నెల ఏడో తేదీన అన్నను నిలదీశాడు. పాత అప్పులకు వడ్డీల కింద కట్టేశానని రాజేశ్ చెప్పాడు. అన్నదమ్ముల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం మోహన్ నీలంపేటలోని సొంతింటికి వెళ్లిపోయాడు. ఉదయం సెల్ ఫోన్ చూసే సరికి ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్టు రాజేశ్ పెట్టిన మెసేజ్‌లు చూసి ఆందోళన చెందాడు. ఈ నెల 8న ఉదయం కాపువీధిలోని ఇంటికి వచ్చి చూస్తే తల్లి రాణి, అమ్మమ్మ పెనుమచ్చు చక్రమ్మ, అన్నయ్య రాజేశ్ కనిపించలేదు. బంధువులకు రెండు రోజులుగా ఫోన్లు చేసి వాకబు చేశాడు. ఆచూకీ లేకపోవడంతో ఈ నెల పదో తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజేశ్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా విచారణ చేస్తున్నామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. నాతవరం మండలం ఎంబీ పట్నం ఏలేరు కాలువ వద్ద చివరిగా సిగ్నల్స్ కనిపించాయన్నారు. అన్ని వాట్సాప్ గ్రూపుల్లో ముగ్గురి ఫొటోలు పెట్టినట్టు ఆయన చెప్పారు. ఏడు రోజులుగా తల్లి, అమ్మమ్మ, అన్నయ్య ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళనగా ఉందని మోహన్ వాపోయాడు.

రాష్ట్రాభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

- ఏడు నెలల్లో ఏపీకి భారీగా నిధులు
- విశాఖ ఉక్కు పరిశ్రమకు ఎలాంటి ఢోకా లేదు
- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

ఒంగోలు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. ఒంగోలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చిన ఏడు నెలల కాలంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రూ.3 లక్షల కోట్ల నిధులను కేంద్రం ఇచ్చిందన్నారు. అమరావతి నిర్మాణం, పోలవరం, విశాఖ రైల్వే జోన్, రామాయపట్నంలో బీపీసీఎల్ టెర్మినల్, అమరావతికి రైల్వే మార్గాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారన్నారు. దేశంలోనే అత్యున్నతమైన స్టీల్‌ప్లాంట్ విశాఖలో ఉందన్నారు. నష్టాల్లో ఉన్న పరిశ్రమను గతంలో కేంద్రం ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనలో ఉండేదన్నారు. రాష్ట్రానికి ఆ పరిశ్రమ గుండెకాయ వంటిదని గుర్తించి రూ.11,400 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. భవిష్యత్‌లో కూడా స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. 2030 నాటికి దేశంలో 300 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీలు స్టీల్‌ప్లాంట్‌పై బాధ్యతారహిత ప్రకటనలు చేస్తున్నాయని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం ఉంటే ఎందుకు ఆర్థిక ప్యాకేజీని ప్రకటిస్తుందని శ్రీనివాసవర్మ ప్రశ్నించారు. 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాటలోకి తెచ్చేందుకు కేంద్రం చర్యలు తీసుకుందన్నారు. త్వరలోనే ఉద్యోగుల పెండింగ్ జీతాలు చెల్లిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం బీఆర్టీఎస్ రహదారి సమీపంలోని శ్రీకృష్ణ వేణుగోపాల స్వామి శ్రీకృష్ణాలయం ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గర్భాలయంలో వేణుగోపాల స్వామిపాలరాతి మూలవిరాట్టు విగ్రహ ప్రతిమకు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం నిర్వహించిన పరసలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మాడుగు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు గండిబాబ్జీ, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వామిని దర్శించుకున్నారు. కార్పొరేటర్లు ముమ్మన దేవుడు, సేనాపతి వసంతశంకర్రావు, బల్ల శ్రీను, అయిత సింహాచలం కమిటీ సభ్యులు చీర అప్పలరాజు, కోరాడ చందుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురికాలనీలోని సీతారామాలయవార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ నెల 27వరకు వార్షిక కళ్యాణం, సీతారాములు కళ్యాణం, సుదర్శన హోమం, సుందర కాండ పారాయణం, అన్నదానం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కూర్మన్నపాలెం: డాక్‌యార్డు కాలనీ, కాపుజగ్గరాజుపేట, సత్తివానిపాలెం, ఎస్టీబీఎల్ గ్రామాల సత్తెమ్మ తల్లి మహోత్సం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మేలుకొలుపు, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు.

కూర్మన్నపాలెం: శాతవాహన నగర్‌లో శుక్రవారం వరసిద్ధి వినాయక ఆలయ 20 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. కాత్రగడ్డ దుర్గా ప్రసాద్, బంద్రెడ్డి శేషగిరిరావు, ధనుంజయ రెడ్డి, చిరట్ల సాయిరామ్, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: సత్తెమ్మ తల్లి పండుగ ముగింపు మహోత్సవాలను పురస్కరించుకుని ఎల్‌బీఎస్ నగర్‌లో శుక్రవారం మహిళలు పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించుకున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాము గారడీలు, కోలాటాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్ర కథలు తదితర సాంస్కృతిక కార్య క్రమాలు జరిగాయి.

గాజువాక: సింహగిరి కాలనీ తుంపాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు అరవెల్లి గణేశ్ శర్మ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. పూజలో ఆలయ ధర్మకర్త బొడ్డేడ వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: స్థానిక కొత్తపాలెంలోని శ్రీ విజయ దుర్గా దేవి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సారెను, ఆభరణాలను ఊరేగించారు.

అగనంపూడి: ఈ- బోనంగిలో పోలమాంబ అమ్మవారి ఆలయం 12వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించనున్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు పురవీధుల్లో సారె ఊరేగింపు చేపడతారు. మధ్యాహ్నం అన్నసమారాధను ఏర్పాటు చేశారు. సాయంత్రం తీర్థ మహోత్సవం, మహిళల కోలాటాలు, చెక్క భజనలు, గరిడీల ప్రదర్శనలు ఉంటాయని మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు తెలిపారు.

ఒక్క అడుగు ఆక్రమణకు గురైనా అధికారులదే బాధ్యత

- అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మహారాణిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన విశాఖ డివిజన్ రెవెన్యూశాఖ సమావేశంలో ఫ్రీ హోల్డ్, భూముల క్రమబద్ధీకరణ, ఆక్రమణల తొలగింపు, ఎన్‌ఓసీ పత్రాల జారీ, సర్వే మ్యుటేషన్ ప్రక్రియ, 22ఏ భూముల డీ నోటిఫికేషన్, కోర్టు కేసులపై స్పందన, ధ్రువపత్రాల జారీ, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక వాతావరణంలో సమస్యలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సులభతర రీతిలో రెవెన్యూ సేవలు అందించాలని హితవు పలికారు. కొత్తగా ఒక్క అడుగు స్థలం ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సర్వే, రెవెన్యూ శాఖల సహకారంతో దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, ఇతర విభాగాల సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

విజ్ఞాన్ రెక్టార్‌కు ఒకేషనల్ సర్వీస్ అవార్డు



రోటరీ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు రోటరీ సంస్థ ఒకేషనల్ సర్వీస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు నుంచి శుక్రవారం అవార్డును అందుకున్నారు. విద్యా రంగంలో చేపడుతున్న విశిష్ట సేవలు గుర్తించి అవార్డును అందించినట్లు గవర్నర్ తెలిపారు. అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని రెక్టార్ పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాం కాలనీలో సత్య మెడికల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 160 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కె.రాము, భవానీశంకర్, స్థానికులు అచ్చిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను భయాందోళనకు గురిచేయడం తగదు'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కార్మికులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం తగదని ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతి కోసం ప్రతి కార్మికుడు కృషి చేస్తుంటే.. వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా రోజుకో నోటిఫికేషన్ ద్వారా భయపెడుతున్నారన్నారు. బంగారు బాతు లాంటి స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రను తిప్పికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొవిరి అవతారం, బీఎస్.రాజు, గొందేశి ప్రభాకరరెడ్డి, కొమ్ము ప్రసాద్, ఏఎస్.నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పరస



రాముడి దర్శనానికి బారులుతీరిన భక్తులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో సీతారాముల పరస శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కొమ్మాజోస్యుల రామారావు ఆధ్వర్యంలో సీతారాములను పంచామృతాలతో అభిషేకించి అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, పారిశ్రామికవేత్త అట్టూరి రమేశ్, కరణం ముత్యాలనాయుడు, నేతలు వంగలపూడి గోపి, అలమండ రాజు, గుమ్మడి రామాంజనేయులు,యు ప్రవీణ్ తదితరులు పూజలు చేశారు. పరస సందర్భంగా ఏర్పాటుచేసిన కోలాటం, తప్పెటగుళ్లతో పాటు రేలారే రేలా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ప్రారంభం

మల్కాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బ్యూటీషియన్ కోర్సులో శిక్షణను శ్రీరామ్‌నగర్‌లో కోరమాండల్ ఎరువుల కర్మాగారం డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. 30 మంది మహిళలకు 45 రోజులు పాటు శిక్షణ ఇస్తారన్నారు. ఇందుకోసం రూ.6 లక్షలు ఖర్చు చేయనున్నట్టు వివరించారు. శిక్షణ పూర్తయిన తరువాత అందరికీ కిట్స్ అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేత కోరాడ శ్రీనివాసరావు, సంస్థ డిప్యూటీ మేనేజర్ (సీఎస్ఆర్) శేషపు వెంకటరమణ, సీఎస్ఆర్ ప్రతినిధి దర్మాల వేణుగోపాల్‌రెడ్డి, వల్లంశెట్టి శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జూలో చలువ పందిళ్లు

వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించే చర్యలు

- జంతువులు, పక్షులు సంరక్షణకు ప్రణాళిక
- తాటాకులు, రెల్లిగడ్డితో నీడ కల్పన
- వట్టివేరు చాపలు, స్ప్రింకర్లు ఏర్పాటు
- ఎలక్ట్రోలేట్స్, గ్లూకోజ్ ద్రావణం అందించేందుకు సిద్ధం



జంతువుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

విశాఖపట్నం/ఆరిలోవ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చేసింది..ఎండ తీవ్రతకు మనుషులే కాదు...జంతువులు, పక్షులు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. సున్నితమైన జీవుల పరిస్థితి మరీ ఇబ్బందిగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో జంతువులు, పక్షులు, ఇతర జీవులకు వేసవితాపం నుంచి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అవి ఉండే ఎన్‌క్లోజర్లలో తాటాకులు, రెల్లిగడ్డితో చలువ పందిళ్లు, వట్టివేరు చాపలు ఏర్పాటు చేస్తున్నారు. వేడి రాకుండా స్ప్రింకర్లతో నీటిని వెదజల్లే ప్రక్రియ ప్రారంభించారు.

ప్రతి వేసవిలానే ఈ ఏడాది అప్పుడే జంతు ప్రదర్శనశాలలో వేసవి సంరక్షణ ప్రణాళికలు అమలుచేస్తున్నారు. ప్రస్తుతానికి రూ.ఐదు లక్షల ఖర్చుతో పలు రకాలుగా ఉపశమన చర్యలు చేపడుతున్నామని జూ క్యూరేటర్ మంగమ్మ పేర్కొన్నారు. వేసవిలో జంతువులు,పక్షులు, ఇతర జీవుల రక్షణకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.



జూ సందర్శనకు వచ్చే పర్యాటకులు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన చలువ పందిరి

జూలో 900 రకాల జీవులు

జూలో జంతువులు, పక్షులు, పాములు మొదలైనవి సుమారు 900 రకాలున్నాయి. వాటిలో కొన్ని సున్నితమైనవి, మరికొన్ని క్రూరమృగాలు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏనుగులు, అడవిదున్నలు, జింకలు, జిరాఫీ, కోతులు, ఇతర జంతువులు ఉండే ఎన్‌క్లోజర్స్ వద్ద ఇప్పటికే తాటాకులు, రెల్లిగడ్డి పందిళ్లు వేయగా మిగిలినవి ఈనెల 25వతేదీ నాటికి పూర్తిచేస్తారు. ఎన్‌క్లోజర్లకు వట్టివేరు చాపలు అమర్చుతారు. పగటిపూట జంతువులు పందిళ్ల కింద సేదదీరుతాయి. రాత్రిపూట ఎన్‌క్లోజర్లలోనికి వెళ్లిపోతాయి. ఎన్‌క్లోజర్‌లో స్రింకర్లతో నీటిని స్ప్రే చేస్తున్నారు. ఫ్యాన్లు ఏర్పాటు చేయనున్నారు. చింపాంజి ఉండే ఎన్‌క్లోజర్‌లో కూలర్ పెట్టాలని నిర్ణయించారు. ఎన్‌క్లోజర్లకు కూల్‌రూఫ్ వేయనున్నారు. ఎండ తీవ్రత నుంచి రక్షణకు ఈ చర్యలతోపాటు వేసవితాపాన్ని తట్టుకుని, దాహార్తి తీర్చేలా జంతువులు, పక్షులకు ఎలక్ట్రోలైట్స్, గ్లూకోజ్ వంటి ద్రావకాలు అందించనున్నారు. వేసవి ప్రభావంతో అస్వస్థతకు గురైన జింకలకు సెలైన్లు పెడతారు. అడవిదున్నలు, ఏనుగులు, ఇతర పెద్ద జంతువులకు నీటిలో ఒక లీటరుకు 30 గ్రాముల ఎలక్ట్రోలైట్స్ కలిపి అందించనున్నారు. అవసరమైతే విటమిన్స్‌తో కూడిన ద్రావణాలు ఇచ్చేలా ప్రతిపాదించారు. ద్రావకాలతో పాటు ప్రతి రోజూ ఇచ్చే ఆహారంలో మార్పులు చేయనున్నారు. ఆహారం ముద్దగా చేసి ఉండలుగా అందించనున్నారు. చలువ చేసే ఆహారం ప్రధానంగా కీరదోశ సరఫరా చేస్తారు. వేసవి తీవ్రత పెరిగే కొద్దీ ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి ఎనిమిది వరకు సాయంత్రం 4.30 గంటలకు ఎలక్ట్రోలైట్స్ సరఫరాకు నిర్ణయించారు. వేసవిలో పక్షులపై మరింత ఎండ ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో పక్షులను ఉంచే ఎన్‌క్లోజర్లలో వట్టివేరు చాపలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఏప్రిల్ నుంచి వర్షాకాలం ప్రారంభయ్యే వరకు ఉదయం, సాయంత్రంతో పాటు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఎక్కువ శాతం ద్రావకాలు ఇవ్వాలని ప్రతిపాదించారు.



ఎన్‌క్లోజర్‌పై చల్లదనానికి నీళ్లు చిమ్ముతున్న సిబ్బంది



లవ్‌బర్డ్స్ ఎన్‌క్లోజర్ వద్ద ఏర్పాటు చేసిన తాటాకుల పందిరి

వేసవి ప్రణాళికలు సిద్ధం



వేసవి నేపథ్యంలో జూలో అన్ని ప్రాణుల రక్షణకు చర్యలు తీసుకున్నాం. సుమారు రూ.5 లక్షలతో కార్యక్రమాలు అమలుచేస్తున్నాం. కొన్నిచోట్ల ఎన్‌క్లోజర్లలో తాటాకులు, రెల్లిగడ్డితో పందిళ్లు వేశాం. జంతువులు తిరుగాడే ప్రాంతాల్లో స్ప్రింకర్లతో నేల చల్లగా ఉండేలా నీటిని స్ప్రే చేస్తున్నాం. ఈనెల 25 నాటికి పనులు పూర్తవుతాయి. ఆహారం సరఫరాలో జాగ్రత్తలు తీసుకుంటాం. వైద్యుల పర్యవేక్షణలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించి జీవులు వడదెబ్బకు గురైతే గుర్తించి ఉపశమనం కల్పించేలా బృందాలను నియమించాం. వర్షాలు కురిసే వరకు రక్షణ చర్యలు తీసుకుంటాం.

- మంగమ్మ, క్యూరేటర్, ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల

చిన్నారుల్లో క్యాన్సర్



ఉత్తరాంధ్రలో ఏటా వందలాది మంది వ్యాధి పీడితులు

- సకాలంలో గుర్తించడం కీలకం..
- మెరుగైన వైద్య సేవలతో కోలుకునే అవకాశం
- నేడు వరల్డ్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

క్యాన్సర్ కోరల్లో చిక్కుకుని చిన్నారులు అల్లాడుతున్నారు. గతంతో పోలిస్తే దీని బారినపడుతున్న వారి సంఖ్య పెరిగింది. ఉత్తరాంధ్రకి చెందిన వందలాది మంది వివిధ రకాల క్యాన్సర్ల బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పెద్దలతో పోలిస్తే చిన్నారుల్లో క్యాన్సర్ల తీవ్రత తక్కువగా ఉండడం, సకాలం లో గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించడంతో రికవరీ రేటు అధికంగా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్ల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా ఫిబ్రవరి 15న చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే నిర్వహిస్తున్నారు.

ఏటా లక్షలాది మంది చిన్నారులు వివిధ రకాల క్యాన్సర్ల బారినపడుతున్నారు. దేశంలో ప్రతి ఏటా కొత్తగా 70 వేల కేసులు నమోదవుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అవగాహన లేకపోవడం, వ్యాధిని గుర్తించినా మెరుగైన వైద్య సేవలను అందించలేకపోవడం తదితర కారణాలతో చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. దీంతో అనేక సంస్థల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశంతో చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే నిర్వహిస్తున్నారు. అమెరికన్ చిల్డ్రన్ క్యాన్సర్ ఆర్గనైజేషన్ అనేక దేశాల్లోని సంస్థలతో కలిసి అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తోంది.

ఈ క్యాన్సర్లు అధికం..

ఉత్తరాంధ్ర ప్రాంతంలోని చిన్నారులకు బ్లడ్, బ్రెయిన్ ట్యూమర్స్, సాఫ్ట్ టిష్యూ, లుకేమియా (తెల్ల రక్త కణాలకు వచ్చే క్యాన్సర్), మెదడు, పొట్టలో (న్యూరో బ్లాస్టోమా) వంటి క్యాన్సర్లు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. వీటితోపాటు కిడ్నీ, లింఫోమా (గ్రంధులకు సంబంధిం చిన), రెటీనో బ్లాస్టోమా (కంటిలో తెల్లగా వచ్చే), జర్మ్‌సెల్ ట్యూమర్స్ (అండాలకు, వృషణాలకు వచ్చేవి) కనిపిస్తున్నాయి. అధిక శాతం జన్యుపరమైన కారణాలేనని పేర్కొంటున్నారు.

నగర పరిధిలోని పది ఆస్పత్రుల్లో ఏటా సుమారు 1,200 కొత్త క్యాన్సర్ కేసులను గుర్తిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

90 శాతం కోలుకునే ఛాన్స్..

చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్లను సకాలంలో గుర్తిస్తే 80 నుంచి 90 శాతం నివారణ సాధ్యమేనని నిపుణులు చెబుతున్నారు. కీమో థెరపీ, సర్జరీ, అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే రేడియేషన్ థెరపీ ఇస్తారు. కొన్ని క్యాన్సర్లకు టార్గెటెడ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది.

లక్షణాలతో గుర్తించే చాన్స్..

చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్లను కొన్ని లక్షణాలను బట్టి ప్రాథమికదశలో గుర్తించే వీలుంది. ఫిట్స్, తలనొప్పి వచ్చి వాంతులు కావడం, బ్లడ్ లేకపోవడం, మెడ, చంకలో పిక్కలు, కారణం తెలియకుండా తరచూ జ్వరం, మజిల్స్‌లో ట్యూమర్లు, కడుపులో గడ్డలు, నడుస్తుండగా బ్యాలెన్స్ తప్పడం లాంటి లక్షణాలుంటే అనుమానించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. 20 ఏళ్లలోపు క్యాన్సర్ బారినపడినా చైల్డ్‌హుడ్ కేన్సర్‌గా చికిత్స చేస్తారు.

గుర్తించడమే అత్యంత కీలకం



చిన్నారుల్లో ఏ క్యాన్సర్ అయినా సకాలంలో గుర్తించడం కీలకం. రికవరీ రేటు అధికం. అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఏటా 100 నుంచి 120 వరకు చిన్నారుల్లో వచ్చే రకరకాల క్యాన్సర్లు చూస్తుంటాం. క్యాన్సర్ నుంచి కోలుకునే చిన్నారులు ఆ తరువాత సాధారణ జీవితాలను గడపగలరు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ వై.విజయ ఆదిత్య, క్యాన్సర్ వైద్య నిపుణులు, హెచ్‌సీజీ పినాకిల్ క్యాన్సర్ ఆస్పత్రి

నేవీ విక్చువల్ యార్డ్‌లో 70 ఏళ్ల ఉత్సవం



విక్చువల్ యార్డ్‌లో సిబ్బంది

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళంలోని విక్చువల్ యార్డ్ (ఆహార పదార్థాలు సరఫరా చేసే విభాగం) ఏర్పాటు చేసి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉత్సవం నిర్వహించారు. ఆ విభాగంలో పనిచేస్తున్న వారిని నేవీ అధికారులు అభినందించారు. 24/7 పనిచేస్తూ ఎప్పుడంటే అప్పుడప్పుడు కదనరంగంలోకి దిగడానికి సిద్ధంగా ఉండే నేవీ నౌకలు, సబ్‌మెరైన్లకు అవసరమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచుతున్నారని వారిని ప్రశంసించారు.



సీఎంఆర్ సెంట్రల్‌లో ఏర్పాటు చేసిన లవ్ సింబల్



తీరంలో కేరింతలు కొడుతున్న యువతీ, యువకులు

ప్రేమికుల సందడి

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో యువతీ యువకులు సందడి చేశారు. ప్రేమికులు ఒకరికి ఒకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. తీరానికి చేరుకుని అలలపై సయ్యాటలాడారు. మద్దిలపాలెంలోని సీఎంఆర్ సెంట్రల్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడ లవ్ సింబల్ వద్ద ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ఆర్‌కే బీచ్ వద్ద ఏర్పాటు చేసిన వాలెంటైన్స్ డే స్వాగత ద్వారం

సామాన్యుల అభ్యున్నతికి బ్యాంకులు సహకరించాలి: కలెక్టర్

మహారాణిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సామాన్యులు, రైతుల అభ్యున్నతికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తూ, రుణ మంజూరు ప్రక్రియలో సరళతర విధానాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ బ్యాంకర్లకు సూచించారు. శుక్రవారం వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు సకాలంలో రుణాలు రెన్యువల్ చేయాలని, రైతులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అండగా నిలవాలని సూచించారు. దరఖాస్తుదారుకు వీలైనంత త్వరగా సమాధానం చెప్పాలని, పదే పదే బ్యాంకుల చుట్టూ తిప్పించుకోవద్దని హితవు పలికారు. వ్యవసాయ, విద్యా సంబంధిత రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని, స్వయం ఉపాధి పొందాలనుకునేవారికి అన్ని విధాలా చేయూత అందించాలని కలెక్టర్ సూచించారు. లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గృహ రుణాల మంజూరు, బ్యాంక్ లింకేజీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వ్యవసాయ పశు సంవర్ధక శాఖ, డీఆర్‌డీఏ, యూసీడీ అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆటో డ్రైవర్ హత్య

- ఆటోలో నిద్రిస్తుండగా కత్తితో దాడిచేసిన మరో డ్రైవర్
- అంతకుముందు ఇద్దరి మధ్య వాగ్వాదం
- నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మల్కాపురం ఆటోస్టాండ్‌లో సంఘటన



శ్యామ్‌కుమార్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

మల్కాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్నేహితులైన ఇద్దరు ఆటో డ్రైవర్ల మధ్య ఘర్షణ హత్యకు దారితీసింది. ఈ సంఘటన గురువారం రాత్రి మల్కాపురం ఆటోస్టాండ్‌లో జరిగింది. మల్కాపురం ప్రాంతానికిచెందిన నీలాపు శ్యామ్‌కుమార్‌రెడ్డి (30), శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన చెల్లా అప్పన్నరెడ్డి ఆటోడ్రైవర్లు. వీరిద్దరూ గురువారం రాత్రి మద్యం సేవిస్తుండగా శ్యామ్‌కుమార్‌రెడ్డి అప్పన్నరెడ్డి వ్యక్తిగత విషయం ప్రస్తావించాడు. దీంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. శ్యామ్‌కుమార్‌రెడ్డి తోయడంతో అప్పన్నరెడ్డి కిందపడిపోయి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం శ్యామ్‌కుమార్‌రెడ్డి తన ఆటోలో నిద్రిస్తుండగా రాత్రి 11:30 సమయంలో అప్పన్నరెడ్డి వచ్చి కత్తితో దాడిచేశాడు. శ్యామ్‌కుమార్‌రెడ్డి పెద్దగా కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితుడ్ని స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసి పంపేశారు. కాగా అతడు ఇంటికి వెళ్లకుండా ఆటోలనే నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారేసరికి ఆటో నిండా రక్తం, కుట్లు తెగిపోయి, అతడు స్పృహలో లేకపోవడంతో మళ్లీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, కేజీహెచ్‌కు తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మల్కాపురం సీఐ సంపతరావు విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా అప్పన్నరెడ్డి జేబులో ఎప్పుడూ కత్తి ఉంటుందని పలువురు ఆటోడ్రైవర్లు చెబుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని రైల్వే పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.1.4 లక్షల విలువైన 28 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తన సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రైల్లో గంజాయి రవాణా చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనుర్బా సర్కార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన జె.వర్మలను పట్టుకుని జీఆర్పీకి అప్పగించారు. జీఆర్పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారని రైల్వే పోలీసులు తెలిపారు.

రెవెన్యూ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



రెవెన్యూ ఉద్యోగుల సంఘం ముద్రించిన డైరీని ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ, అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం రూపొందించిన 2025 డైరీని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానిశంకర్, ఆర్డీవో పి. శ్రీలేఖ, కలెక్టరేట్ పాలనాధికారి డి.ఈశ్వరరావు, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు త్రినాథరావు, రమేష్, రాష్ట్ర కార్యదర్శి డి.రాజేంద్రవర్మ, సంఘ ప్రతినిధులు శ్యాంప్రసాద్, శైలజ, నియోగి, రవిశంకర్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



లక్ష్మణరావు మృతదేహం

గాజువాక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పరామర్శకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి.. సీతమ్మధారలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న లక్ష్మణరావు (52), అదే అపార్ట్‌మెంట్‌లో దోబీగా పనిచేస్తున్న వెంకటరమణ శుక్రవారం ద్విచక్ర వాహనంపై అనకాపల్లిలోని బంధువులను పరామర్శించేందుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా పాతగాజువాక జంక్షన్ వద్ద వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుకకూర్చున్న లక్ష్మణరావు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. వాహనాన్ని నడుపుతున్న వెంకటరమణకు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో పోలీసుల విస్తృత తనిఖీలు

మహారాణిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. డ్రగ్స్, గంజాయి, దొంగనోట్ల ముఠాలు ప్రవేశించాయనే సమాచారంతో అసాంఘిక శక్తులను ఏరి వేసేందుకు జల్లెడ పడుతున్నారు. వారం రోజుల్లో టాస్కుఫోర్సు సిబ్బంది, పోలీసులు కలసి నిర్వహించిన తనిఖీల్లో గాజువాక పరిధిలో నాలుగు గ్రాముల ఎండీఎంఏ, రెండు రోజుల క్రితం ఆరిలోవ పోలీసుస్టేషన్ పరిధిలోని విశాలక్షినగర్‌లో సుమారు 2 గ్రాముల బ్రౌన్‌షుగర్ లభించినట్లు తెలిసింది. దొంగనోట్లు, గంజాయితో పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ప్రస్తుతం పోలీసు అధికారులు ఎలాంటి అధికార ప్రకటన చేయకుండా గోప్యత పాటిస్తున్నారు. కానీ డ్రగ్స్ విస్తృతంగా లభిస్తుండడంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో లాడ్జీలు, హోటళ్లు, గెస్టహౌస్‌లతో పాటు అనుమానిత ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.